ప్రజాశక్తి

బుధవారం 2 అక్టోబర్ 2024 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

దీక్షలో విద్యార్థి, యువజన సంఘాల నేతలు

విశాఖ స్టీల్‌ప్లాంట్

ప్రైవేటీకరణ యత్నాన్ని విరమించుకోవాలి

- సెయిల్‌లో విలీనం చేయాలి
- నిరసన దీక్షలో విద్యార్థి, యువజన సంఘాల నేతల డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసే ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని పలువురు విద్యార్థి, యువజన సంఘాల నేతలు డిమాండ్ చేశారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ విరమించుకోవాలని, సెయిల్‌లో విలీనం చేయాలని కోరుతూ మంగళవారం ఒంగోలు కలెక్టరేట్ వద్ద ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్, పిడిఎస్‌యు, డివైఎఫ్‌ఐ, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. కార్యక్రమానికి ఎస్‌ఎఫ్‌ఐ ప్రకాశం జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్ అధ్యక్షత వహించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మహంకాళి సుబ్బారావు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయవద్దని, ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు జరిగాయన్నారు. ఆంధ్రుల ఆత్మ గౌరవాన్ని కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా ఈ ప్రయత్నాన్ని విరమించుకోవాలని సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు ఎల్.రాజశేఖర్ మాట్లాడుతూ ▶ 2లో

మద్యం మళ్లీ ప్రైవేటుకు..

- జిల్లాలో 171 దుకాణాలకు నోటిఫికేషన్
- మండలానికి 4 షాపులకు పైగా కేటాయింపు.!
- గతంలోలా భారీగా పోటీకి సిద్ధమవుతున్న వ్యాపారులు
- బెల్టు దుకాణాలపై మహిళల్లో పెరుగుతున్న ఆందోళన

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

మద్యం క్వార్టర్ ధరను రూ.99కు నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు మద్యం వ్యాపారాన్ని తిరిగి ప్రైవేటుకు అప్పగించేందుకు నూతన విధానం అమలులోకి తెచ్చింది. మంగళవారం నుంచే కొత్త మద్యం దుకాణాలను దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. జిల్లాలో ఇప్పటివరకూ ఎక్సైజ్‌శాఖ నేతృత్వంలో దుకాణాలను నిర్వహించి మద్యం అమ్మకాలు చేపట్టారు. దీన్ని మార్పు చేసి గతంలో మాదిరిగా ప్రైవేటు వ్యాపారులకు అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూతన విధానాన్ని ఖరారు చేసింది. జిల్లాలో 171 మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ జారీచేశారు. వీటితో పాటు మరో 18 దుకాణాలు కల్లుగీత కార్మికుల కోసం రానున్నాయి. తొలుత 171 దుకాణాలకు కలెక్టర్ ఆమోదముద్ర వేశారు. వీటి కోసం దరఖాస్తులు స్వీకరిస్తారు. మొత్తంగా చూస్తే మండలానికి 4 షాపులకు పైగా కేటాయించే అవకాశం ఉంది. 11న వేలం నిర్వహించి మరుసటి రోజు నుంచే దుకాణాలు కేటాయిస్తారు. ఇదంతా గతంలో జరిగిన ప్రక్రియే.. 2014 నుంచి 2019 వరకూ ఉన్న విధానమే ఇప్పుడు రానుంది. ఇక మద్యం దుకాణాలకు లైసెన్సుల జారీ ప్రక్రియ నుంచే భారీ ఆదాయం రాబట్టుకునేందుకు ప్రభుత్వం సన్నాహాల్లో ఉంది. లైసెన్సు ఫీజుల శ్లాబులను ప్రకటించారు. 10 వేల జనాభాలోపు రూ.50 లక్షలు ఖరారు చేశారు. 10 వేల నుంచీ 50 వేల లోపు జనాభా ఉంటే రూ.55 లక్షలు, 50 వేల నుంచీ 5 లక్షల జనాభా ఉంటే రూ.65 లక్షలు, 5 లక్షలకు పైగా జనాభా ఉంటే రూ.85 లక్షలు ఫీజు పెట్టారు. ఈ లెక్కన అన్నీ దుకాణాలు దాదాపుగా 10 వేల జనాభా ఉన్నవే ఉన్నాయి. అంటే పోటీ లేకున్నా ఈ దుకాణాల నుంచి లైసెన్సు ఫీజు రూ.85.50 కోట్లు రావడం గ్యారంటీ. ఇక పోటీ పడితే ఎంత పలుకుతాయో చెప్పలేం. భారీగా పోటీ ఉంటే రూ.వంద కోట్లు దాటడం ఖాయమంటున్నారు. ఎంత మేరకు పోటీ ఉంటుందో చూడాలి. సిండికేట్‌గా మారే అవకాశాలు ▶ 2లో

మాట్లాడుతున్న మంత్రి స్వామి

వృద్ధులు అనుభవాల గనులు

వయోవృద్ధుల దినోత్సవ సభలో మంత్రి స్వామి ▶ 3లో

పింఛన్ అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

ఆర్టీసీ డబుల్ ధమాకా.!

- సాధారణ ఛార్జీలతో ప్రత్యేక సర్వీసులు
- రానుపోను రిజర్వేషన్‌కి 10 శాతం రాయితీ
- దసరాకు 139 ప్రత్యేక సర్వీసులు

ప్రకాశం రీజియన్ పరిధిలో దసరా పండుగకు 139 ప్రత్యేక బస్సులను నడుపుతోంది. ఆర్టీసి డబుల్ ధమాకాపై ప్రజాశక్తి ప్రత్యేక కథనం..

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రయాణీకులకు ఇది నిజంగా శుభవార్తే.. దసరా పండుగ వచ్చిందంటే ప్రత్యేక బస్సుల పేరిట 50 శాతం పైగా ఛార్జీలు వసూలు చేసేవారు. ప్రస్తుతం ప్రయాణీకులకు ఆర్టీసి డబుల్ ధమాకా అందిస్తోంది. ప్రస్తుత దసరా పండుగ సందర్భంగా సుదూర ప్రాంతాలకు సాధారణ ఛార్జీలతో ప్రత్యేక సర్వీసులు నడుపుతోంది. ప్రయాణీకులు రానుపోను రిజర్వేషన్ చేయించుకుంటే 10 శాతం రాయితీ అందించటం విశేషం. ఆర్టీసి

దసరా పండుగ వస్తుందంటే వివిధ రాష్ట్రాలు, జిల్లాలలో ఉద్యోగాలు, వ్యాపారాలు, వివిధ పనులపై వెళ్ళేవారు స్వగ్రామాలకు రావటం జరుగుతోంది. సూదూర ప్రాంతాల నుంచి ప్రజలు సొంత ఊళ్ళకు రావటానికి సరిపడిన రవాణా సౌకర్యాలు లేక ప్రైవేట్ ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తుంటారు. ఇదే అదనుగా ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు దోపిడీకి తెరలేపుతున్నారు. వీటిని దృష్టిలో ఉంచుకొని ప్రయాణీకుల సౌకర్యార్థం ఆర్టీసి ప్రత్యేక బస్సులు నడిపేందుకు నిర్ణయం తీసుకుంది.

ప్రత్యేక బస్సులకు ప్రణాళికలు

ప్రయాణీకుల సౌకర్యార్థం ఎపిఎస్‌ఆర్టీసి ప్రత్యేక బస్సులను నడుపుతోంది. దసరా పండుగ సందర్భంగా, హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై వంటి దూర ప్రాంతాల నుండి ప్రకాశం జిల్లా లోని వివిధ ప్రాంతాలకు వచ్చే ప్రయాణీకుల కోసం ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు ప్రత్యేక బస్సులను నిర్వహిస్తోంది. అన్ని రోజువారీ సర్వీసులతో పాటు సాధారణ చార్జీలతో ప్రత్యేక సర్వీసులను నడుపుటకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఆయా తేదీలలో హైదరాబాద్ నుండి 136 సర్వీసులు, బెంగుళూరు నుండి 8, చెన్నై నుండి 5 సర్వీసులు ముందస్తుగా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. ఆయా తేదీలలో ప్రత్యేక సర్వీసులను సాధారణ చార్జీలతో నడుపుతున్నారు. ప్రయాణీకులు ఆన్‌లైన్ లేదా సమీపంలోని ▶ 2లో

సోలార్ ద్వారా వ్యవసాయానికి విద్యుత్

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-పంగులూరు

ప్రస్తుత సమాజంలో విద్యుత్ అనేది చాలా విలువైనదని, ఎంతో ప్రాధాన్యత గలదని, దాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకుంటే రాష్ట్రం ఎంతో అభివద్ధి సాధిస్తుందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. మంగళవారం పంగులూరు లోని బీసీ కాలనీలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం అనంతరం జరిగిన సభలో రవి కుమార్ మాట్లాడారు. వ్యవసాయానికి విద్యుత్తును తగినంతగా ఉపయోగించుకునేందుకు సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇటీవల జరిగిన సమావేశంలో సూచించారని చెప్పారు. అందుకనుగుణంగా కుసుమ ప్రాజెక్టు ద్వారా సోలార్ ప్లాంట్లు రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఈ సోలార్ ప్లాంట్ల ద్వారా తక్కువ ఖర్చుతో వ్యవసాయానికి ఉపయోగపడే విద్యుత్తును ఉపయోగించవచ్చుని, వ్యవసాయంలో మంచి ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో నివాస గహాలకు కూడా సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని, ఒక్కో ఇంటికి మూడు కిలోవాట్ల విద్యుత్తు ఈ సోలార్ ద్వారా పొందవచ్చని అన్నారు. తూర్పు తక్కెళ్లపాడులో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్య తన దగ్గరకు వచ్చిందని, ఆర్డీవో వారానికి ఒకసారి మండలానికి వస్తే రెవెన్యూపరమైన సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉందని చెప్పారు. అంతకుముందు బీసీ కాలనీలో పెన్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చీరాల ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి, తహశీల్దార్ నాగరాజరావు, ఎంపీడీవో రామాంజనేయులు, తెలుగుదేశం మండల అధ్యక్షుడు రావూరి రమేష్‌బాబు, మాజీ జడ్పీటిసి బాచిన చెంచుప్రసాద్ పాల్గొన్నారు.

మద్యం మళ్లీ ప్రైవేటుకు..

(మొదటిపేజీ తరువాయి)

బలంగా ఉన్నాయి. గతంలో చీమకుర్తి, దోర్నాల, మార్కాపురం తదితర ప్రాంతాల్లో కోటిన్నర వరకూ లైసెన్సు ఫీజు వచ్చింది. అంటే వ్యాపారులు భారీగా పోటీపడ్డారు. ఎక్కువ ఆదాయం వస్తుందని భావించి రూ.లక్షల్లో పాడారు. చీమకుర్తి, మార్కాపురం ప్రాంతాల్లో కార్మికులు ఎక్కువగా ఉంటారు. ఇక్కడే ఎక్కువ మద్యం విక్రయాలు చేయడానికి వీలుంటుంది. ఇప్పుడూ గతంలో మాదిరిగా ఆదాయాలు గ్యారంటీ అనుకున్న దుకాణాలకు భారీగానే పోటీ ఉంటుందని అంచనా. గత ప్రభుత్వం మద్యం దుకాణాల ద్వారానే ఎక్కువ ధరలకు అమ్మింది. అప్పుడు లైసెన్సు ఫీజులు లేవు. ఇప్పుడు దుకాణాలను ప్రైవేటుకు అప్పగించి భారీగా లైసెన్సు ఫీజులు రాబట్టేందుకు కూటమి ప్రభుత్వం ఆలోచించింది. ప్రభుత్వానికి మాత్రం ఆదాయాల్లో పెద్దగా మార్పులు ఉండకపోవచ్చు. మళ్లీ ప్రైవేటుకు అప్పగించడం వల్ల నాయకులకు మద్యం వ్యాపారం రాజకీయ పోషణకు దోహదపడుతుంది. పాలకపక్ష నేతలకు ఇదొక వరంగానే భావించక తప్పదు. మండలాల్లో పాలకపక్ష నేతలే కూటమిగా మారి మద్యం దుకాణాలు దక్కించుకుంటారు. పోటీలున్నా అధికారులే వారిని సిండికేట్‌గా మార్చుతారు. ఇక గతంలో మాదిరిగా గుడి, బడికి దూరంగానే దుకాణాలు నిర్వహించాల్సి ఉంది. భారీగా పోటీపడి దుకాణాలు దక్కించుకునే నేపథ్యంలో విక్రయాలపైనా వ్యాపారులు దృష్టి పెడతారు. మళ్లీ బెల్టు దుకాణాలు విచ్చలవిడిగా పెడతారా? అనే ఆందోళన పెరుగుతోంది. ఇప్పటికే చాలా చోట్ల ఈ బెల్టు దుకాణాలు పెరిగాయి. ఇవి రానున్నకాలంలో దుకాణాల యజమానులే నిర్వహించే ప్రమాదం ఉంది. వీటిపై మహిళల్లో ఇప్పటి నుంచే ఆందోళన వ్యక్తమవుతోంది.

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ యత్నాన్ని విరమించుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరిగితే చదువుకున్న విద్యార్థి యువకులకు ఉద్యోగ అవకాశాలు కోల్పోతారన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య ఉందని, ఇటువంటి సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తే సమస్య పెరిగే అవకాశం ఉందన్నారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ పి.పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తామని కేంద్రం పట్టు పట్టడం సరైనది కాదన్నారు. డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు కెవి పిచ్చయ్య మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు యువకులు, కార్మికులు విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం ఉద్యమిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఇవేవీ పట్టినట్టు తిరుపతి లడ్డును రాజకీయం చేస్తూ ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కరుణానిధి మాట్లాడుతూ టిడిపి సహకారంతో బిజెపి కేంద్రంలో మరోసారి అధికారాన్ని చేజిక్కించుకుందని, రాష్ట్రంలో అధికారంలో పాలుపంచుకున్న బిజెపి ప్రభుత్వం ఈ మేలు మర్చిపోకుండా రాష్ట్రానికి విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రభుత్వ ఆధీనంలోనే ఉంచి రుణం తీర్చుకోవాలన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వినోద్ మాట్లాడుతూ మూడు రోజులపాటు కలెక్టరేట్ వద్ద ఈ నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర కమిటీలు నిర్ణయించాయన్నారు. దీక్షలలో ఎస్ఎఫ్ఐ ఒంగోలు నగర కార్యదర్శి బండి వీరాస్వామి, ఎస్ఎఫ్ఐ నాయకులు విజయ్, కార్తీక్, అశోక్, యశ్వంత్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్యామ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు పి ప్రభాకర్, జిల్లా నాయకులు స్టాలిన్, సురేష్, రాము, అనిల్, విద్యార్థులు, యువజనులు పాల్గొన్నారు.

ఎస్ఐకి ఘన సన్మానం

ప్రజాశక్తి-సిఎస్‌పురం: మండలంలోని కె అగ్రహారం గ్రామానికి చెందిన పలువురు టిడిపి నాయకులు ఎస్ఐ ఆర్ సుమన్‌ను స్థానిక పోలీస్ స్టేషన్లో మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఎస్ఐను కలిసిన వారిలో మాజీ సర్పంచ్ టీవీ సుబ్బారెడ్డి, గ్రామ టిడిపి అధ్యక్షులు యడవల్లి సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి చామల తిరుపతిరెడ్డి, జి కాటమరాజు, వై నారాయణ, చీరలదిన్నె రాయుడు, రాము, కొండయ్య తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ డబుల్ ధమాకా.!

(మొదటిపేజీ తరువాయి)

ఏటీబీ ఏజెంట్ ద్వారా ముందస్తుగా రిజర్వేషన్ పొందవచ్చు. రానుపోను ఒకేసారి రిజర్వేషన్ చేసుకున్న వారికి 10 శాతం రాయితీ సదుపాయం ఆర్టీసి అందిస్తోంది. 60 రోజుల ముందుగానే ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకొనవచ్చు. ఏసి స్లీపర్, నాన్ ఏసి స్లీపర్ సర్వీసులు కూడా సాధారణ చార్జీలతో నడుపుతున్నారు.

హైదరాబాద్‌కి 139 ప్రత్యేక సర్వీసులు

తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌లో ఉన్న జిల్లా ప్రజల కోసం ఆర్టీసి 139 ప్రత్యేక బస్సులను ఈ నెల 8, 11వ తేదీ వరకు నడుపుతోంది. ఇందులో 50 సూపర్ లగ్జరీ సర్వీసులు, 52 అల్ట్రా డీలక్స్ సర్వీసులు, 29 ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఉన్నాయి. గిద్దలూరు డిపో నుంచి 24 బస్సులు, కనిగిరి డిపో నుంచి 33 బస్సులు, మార్కాపురం డిపో నుంచి 22 బస్సులు, ఒంగోలు డిపో నుంచి 40 బస్సులు, పొదిలి డిపో నుంచి 17 ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు.

ఆర్టీసీ సేవలను వినియోగించుకోండి

బి.సుధాకర్, జిల్లా ప్రజా రవాణాధికారి

దసరా పండుగను పురస్కరించుకొని ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసి కల్పిస్తున్న సేవలను వినియోగించుకోవాలి. అధిక ధరలను వసూలు చేస్తున్న ప్రైవేట్ వాహనాలను ప్రయాణికులు ఆశ్రయించవద్దు. భద్రతకు మారు పేరైన ఆర్టీసీ సర్వీసులను ఆదరించాలి. ప్రయాణికులకు మరింత సేవలు అందించేందుకు ఆర్టీసి సహకరించాలి. దసరా పండుగ తరువాత ప్రయాణీకుల తిరుగు ప్రయాణాలకు ప్రణాళికలు సిద్ధం చేశాం.

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-సంతనూతలపాడు

స్థానిక సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో షేక్ హసీనాబేగం సహకారంతో షేక్ బికారి సాహెబ్ (విశ్రాంత ఎంపిడిఓ) పెద్ద కుమార్తె జరీనా బేగం పుట్టినరోజు సందర్భంగా పేదవారు 40 మందికి మంగళవారం దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంతనూతలపాడులోని నాటక కళాకారులైన మంగళపూడి చంద్రశేఖర్ (హరిశ్చంద్ర పాత్రధారి) నీలం చంద్రయ్య (సిద్దయ్య పాత్రధారి) ప్రముఖ కళాకారుడు షేక్ సత్తార్, ప్రముఖ గాయకుడు నూకతోటి శరత్‌బాబు మరొక కళాకారుడు అప్పికట్ల శేషులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ పావులూరి నారాయణస్వామి చౌదరి, జాయింట్ సెక్రటరీ కంకణంపాటి వెంకటేశ్వర్లు, ట్రస్ట్ గౌరవ అధ్యక్షురాలు షేక్ హసీనా బేగం, షేక్ అమీనా, భాస్కరుని సుధారాణి, వేమా కవిత, ఎస్ ధనలక్ష్మి, షేక్ హాజీరా బేగం, సభ్యులు శీలం మల్లారెడ్డి, కొప్పోలు శ్రీనివాసరావు, వేమా నాగరాజు, కొత్తపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ దృశ్యం

Before The Honourable Deputy Registrar of Chits at Ongole
(Application for reference of a Dispute)
Dispute No. 74 of 2024
M/s. Sri Sai Anjana Chit Funds India Pvt., Ltd., Branch at Ongole, Rep.by its Foreman / Branch Manager, Ongole. ... Disputant.
Versus
1. **Kanta Mahesh** and 6 Others ... Opponents.

Notice

To,
Opp-1. **Kanta Mahesh,** S/o **Nageswara Rao,** Occ: Business. Resident at Janardhanapuram, Jarugumalli Mandal, Prakasam District- 523271.
Opp-2. **Bathula Sireesha,** S/o **Hanumantha Rao,** Occ: Agricultural Extension Officer, Department of Agriculture, Joint Director of Agriculture, Ongole, Prakasam District.,Resident at D.No. 1-143, Maddi padu Posts & Mandal, Prakasam District - 523211.
Opp-3. **Dasari Chinna Narasaiah,** S/o **Adeiah,** Occ: School Assistant (Bio Sciense),School Education Department, Mandal Educational Officer, Mundlamur Mandal, Prakasam District., Resident at D.No. 24-178/1, Indira Nagar, Addanki Posts & Mandal, Prakasam District- 523201.

Whereas the above named disputant has instituted a claim for Rs.13,48,576/- (Rupees Thirteen Lakhs Forty Eight Thousand Five Hundred and Seventy Six Only) against you. You are hereby summoned/noticed to appear in this tribunal (Deputy Registrar of chits) in person on **22-10-2024** at the office of Deputy Registrar of Chits, O/o. District Registrar Office, Door No. 2-398/25, K.P.R Plaza, Old Guntur Road, Ongole, Prakasam District. at 11.00 AM in the morning, to answer the claim, and you are directed to produce on that day all the documents upon which you are intend to rely in support of your defence. Take notice that, in default of your appearance on the above day before mentioned, the claim will be heard and determined in your absence.

Kaki Nagaraju, B.A., LL.B.,
Advocate for the Disputant,
Nellore, Cell: **96406 49847**

మహారాజశ్రీ నరసరావుపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) గారి కోర్టులో..
E.P No 1/2023 OS No 497/2014
నామాల వీరభద్రం ....DHR
మరియు
నామాల సత్యవతి వగైరాలు ....JDRS
To,
R5) సూదుల అమర రత్నం w/o వెంకటేశ్వర్లు R/o కొత్త అన్నసముద్రం గ్రామం, త్రిపురాంతకం మండలం ప్రకాశం జిల్లా.

పైనెంబర్ E.P లో పై కోర్టు వారి నుండి ఇప్పటికి అనేక పర్యాయములు తగు కోర్టు వారి ద్వారా నోటీసులు జారీ చేయించగా మీరు సదరు నోటీసులు తీసుకోని కారణంగా ఈ పేపర్ ప్రకటన ద్వారా మీ యొక్క నోటీసునిమిత్తం ది. 24-10-2024 వాయిదా అయి ఉన్నది. కావున వాయిదా రోజు ఉదయం 10:30 కు పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు.లేని యెడల సదరు EP మీ యొక్క పరోక్షమందు తీర్మానించబడును.

కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం
వాయిదా ది. 24-10-2024

ఇట్లు.
శ్రీ బి.అనిల్ కుమార్,
డి.హెచ్.ఆర్ తరపు న్యాయవాది,
నరసరావుపేట.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-దర్శి

స్వర్ణాంధ్రప్రదేశ్-2047లో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ కె ప్రభుదాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి హనుమంతరావు, గణిత శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఏ నగేష్, ఇంగ్లీష్ శాస్త్ర డాక్టర్ ఆర్‌సి రెడ్డి, రసాయన శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ గంధం వేణు, తెలుగు అధ్యాపకులు బివి రమణరావు, చరిత్ర అధ్యాపకులు సౌరాలమ్మ, వైవి రమణరావు, అధ్యాపకులు పాల్గొని విజయవంతం చేశారు.

మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No: 15/2022
వడ్లమూడి చంద్రమౌళి దేవి ...వాది
Vs
తెలగతోటి కుముద్ బిన్ జోషి ...ప్రతివాది
To.
తెలగతోటి కుముద్ బిన్ జోషి, D/o. ఆంజనేయులు, చీరాల టౌన్, బాపట్ల జిల్లా.

పై నెంబరు దావాని వాది బాకీ వసూలు నిమిత్తం దావాని దాఖలు చేసి మీకు ఎన్నిసార్లు సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారని శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వుల మేరకు మీరు తేది: 15-10-2024న ఉదయం 10-30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటలలోపు పై కోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకొనేది. లేనిచో దావాను మీ పరోక్షముగా తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో //
మోతుకూరి శుభాష్ బాబు
మురకొండ చంద్రశేఖర్
అడ్వకేట్స్, అద్దంకి.

మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No: 178/2018
మంగమూరి అరుణ ...వాది
Vs
పరిటాల శరాబంది మరికొందరు ...ప్రతివాది
To.
D7
కోట వెంకట్రావు, S/o. సుబ్బారావు,
కుర్రవానిపాలెం (గ్రామం), కోరిశపాడు (మండలం),
బాపట్ల (జిల్లా).

పై నెంబరు దావాని వాది షెడ్యూలు ఆస్తిలో బాగపంపిణీ చేయమని కోరుచూ దావాని దాఖలు చేసి మీకు ఎన్నిసార్లు సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారని శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వులతో మీరు తేది: 19-11-2024న ఉదయం 10-30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటలలోపు పై కోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకొనేది. లేనిచో దావాను మీ పరోక్షముగా తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో //
మోతుకూరి శుభాష్ బాబు
మురకొండ చంద్రశేఖర్
అడ్వకేట్స్, అద్దంకి.

మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A's No: 106/23, 107/23,108/23
O. S. NO: 313/07
సత్తెనపల్లి సుబ్బాయమ్మ ...పిటిషనర్
Vs
కోలలపూడి సావిత్రి (Died) మరికొందరు
... రెస్పాండెట్స్
To.
R5
అత్తలూరి సునీత, W/o వెంకటేశ్వర్లు,
హౌసింగ్ బోర్డ్ కాలనీ, ఒంగోల్ టౌన్,
ప్రకాశం జిల్లా.

పై నంబరు దావాలో చనిపోయిన సావిత్రికి వారసులుగా మిమ్ములను చేర్చమని పిటిషను దాఖలాకి అయిన జాప్యమును క్షమించమని కోరుచూ పిటిషన్లు దాఖలా చేసి మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారని శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వులతో మీరు తేది 19.11.2024న ఉదయం 10.30 నుండి సాయంత్రం 5.00 గంటలు లోపు పై కోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకొనేది. లేనిచో పిటిషనులు మీపరోక్షముగాతీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో //
మోతుకూరి శుభాష్ బాబు
మురకొండ చంద్రశేఖర్
అడ్వకేట్స్, అద్దంకి

CHANGE OF NAME

I, **MOHMUD ABDUL HAFEEZ,** Resident of Dr. Chalamaiah Gupatas Elegance, Bhagya Nagar 4th Line, Ongole, Prakasam District-523001, Andhra Pradesh., I have changed my name from **MOHMUD ABDUL HAFEEZ** (Old Name) to **MOHAMMAD ABDUL HAFEEZ** (New Name) as per affidavit dated 01-10-2024 before Public Notary, ONGOLE.

వేలం ప్రకటన
మహారాజశ్రీ పర్చూరు సీనియర్ సివిల్ జడ్జ్ వారి కోర్టులో
E. P. 19/2022
in
O.S. 3/2020

Between:-
పోతిని శ్రీనివాసరావు.......డి.హెచ్.ఆర్/ పిటిషనరు
and
రాయనీడి సాంబ శివప్రసాదు
.......జే.డి.ఆర్/ రెస్పోండెంట్స్

పై నెంబర్ అమలు పిటిషనులో ఈ దిగువ తెలిపిన షెడ్యూల్ దాఖలా స్థిరాస్తులను పై కోర్ట్ వారు, విక్రయించు టకు ఉత్తరువులు ఇచ్చి, పై కోర్ట్‌లో ది.06-11-2024 తేదీన ఉదయం గం.10.30. ని. లగయాత్తు బహిరంగ వేలం వేయబడునని, ఇందు మూలముగా తెలియజేయుటమైనది. కావున వేలం పాటలో పాల్గొను దలచిన పాటదారులు హాజరు అయి పాటలో పాల్గొనవచ్చును.

షెడ్యూల్:

Item NO.1 : Prakasam District -Chirala S.R.O. Karamchedu Mandal-Grama Panchayat Karamchedu - Karamchedu village Survey No. 666/2- an extent of AC 1.52 cents agriculture wet land as bonded by :
East : Land of Yaralagadda Bhanu.
South : Land of jagarlaMudi MohanaRao
West : Land of Daggubati Lakshmi Narayana
North : Kalwa
D.Hr. value RS. 3,00,000/-
Ameena value RS . 7,50,000/-

Item NO.2 : Prakasam District- Chirala S.R.O. Karamchedu Mandal- Grama Panchayat Karamchedu- Karamchedu village-Survey No. 40/2 an extent of Ac.6.00 cents agriculture wet land as bonded by:
East : Panta Kaluva & Donka..
South : Rayaneedi SeethaRamaiah.
West : Perni Chinnabbai, Jagarlamudi Subbanna, etc.
North : Donka & Pantakaluva.
D.Hr. value RS . 9,00,000/-
Ameena value RS. 30,00,000/-

Item NO.3 : Prakasam District - Chirala S.R.O. - Karamchedu Mandal-Grama Panchayat Karamchedu-Karamchedu village-Survey No. 40/2 an extent of AC 2.05 cents agricultur wet land as bonded by:
East : Panta kaluva.
South : Jagarlamudi Radhakrishna Murthy
West : Perni Chinnabbai., Jagarlamudi Subbanna. etc.
North : R.SambaSiva Prasad.
D.Hr. value RS. 3,00,000/-
Ameena value RS.. 10,00,000/-

Item NO.4 Guntur District - Peddakakani Sub. dist - venigandla village- venigandla grama panchayat area -venegandla village survey NO. 365 / 2B- VGT-VUDA Vijayawada draft layout to file no E1 /158 /97plan - plots No.627 and 627 A vacant site an extent of 510 square yards (426 .42 sq metres) as bounded by:
East : NO.626 ,626 A plots 76. 06 feet.
South : NO.628 plot. 60.00 feet.
West : 33 feet with road left by vendors 70.00 feet .
North : 33 ft with road .60.00feet.
D.Hr. value RS .2,00,000/-
Ameena value RS. 15,00,000/-

వేలం తేది : **06-11-2024**
ఫర్దర్ హియరింగ్ : **13-11-2024**
పర్చూరు.
ది : **28-09-2024**

// కోర్ట్ వారి ఉత్తరువుల మేరకు //
పోతిని సురేంద్ర
దగ్గుబాటి రాఘవయ్య చౌదరి
D.Hr తరపు అడ్వకేట్స్
ఫోన్: 9440121848

పేదల సంక్షేమమే ధ్యేయం : మంత్రి

ప్రజాశక్తి-టంగుటూరు

సమాజంలో ప్రతి ఒక్కరూ గౌరవంగా జీవించాలన్నదే లక్ష్యంగా ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. మండల పరిధిలోని సురారెడ్డిపాలెం, వల్లూరు పంచాయతీ పరిధిలోని లబ్ధిదారులకు ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు సోమవారం పపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన వాగ్ధానం మేరకు అర్హులైన లబ్ధిదారులందరికీ ఎన్‌టిఆర్ భరోసా కింద సామాజిక భద్రత పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పేద ప్రజల సంక్షేమం, అభివద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. ప్రతి నెలా 1న పెన్షను అందజేలా ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తామన్నారు. ఎస్‌సి,ఎస్‌టి విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా వసతి కల్పించి ఉచిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డిడి లక్ష్మానాయక్, ఎంపిడిఒ రత్నజ్యోతి, టిడిపి మండల అధ్యక్షుడు కామని విజయకుమార్, నాయకులు ఈదర ప్రభాకర్, రామా గోపి, బొజ్జా శ్రీను, సూరారెడ్డిపాలెం సర్పంచి నర్రా శైలుషా, ఉప సర్పంచి మెలకలపల్లి కోటేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ లో మంత్రి స్వామి

శింగరాయకొండ : మండల పరిధిలోని మూలగుంటపాడు పంచాయతీలో ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పెన్షన్లు లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి న్యాయ విభాగం జిల్లా అధ్యక్షుడు సన్నెబోయిన శ్రీనివాసులు నాయుడు, 228 బూత్ కన్వీనర్ నరాల సుధాకరరావు, చిగురుపాటి గిరి, ఎస్.మల్లిఖార్జున మాజీ ఎంపిటిసి ఎల్‌వి.వర్మ, చల్లా శ్రీను, జి.వెంకట్రావు, ఎంపిడిఒ జయమణి, పంచాయతీ కార్యదర్శి రామారావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దారవీడు : మండల పరిధిలోని గుండంచర్ల గ్రామంలో టిడిపి యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరీక్షన్‌బాబు అధికారులతో కలిసి ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి త్వరలోనే పింఛన్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపల్

ధ్రువీకరణ పత్రాలు అందజేత

ప్రజాశక్తి-ఒంగోలు

దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గత నెల 28న నిర్వహించిన ఆన్‌లైన్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ధ్రువీకరణపత్రాలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి. కళ్యాణి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా కల్యాణి మాట్లాడుతూ ప్రోగ్రామింగ్ ఇన్‌సి సర్టిఫికేట్ కోర్సులో 36 మంది విద్యార్థులు పాల్గొనట్లు తెలిపారు. అందులో 33 మంది ఉత్తర్ణత సాధించారన్నారు. అపైథాన్ 3.4.3 సర్టిఫికెట్ కోర్సులో 23 మంది విద్యార్థులు పాల్గొనగా 20 మంది ఉత్తర్ణత సాధించినట్లు తెలిపారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణలను నేర్చుకోవడం ద్వారా ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. జవహర్ నాలెడ్జ్ కేంద్రం పర్యవేక్షకురాలిగా డాక్టర్ రాజ్యలక్ష్మి, ఫుల్ టైమ్ మెంటర్‌గా సురేష్ కుమార్ వ్యవహరించారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను ప్రిన్సిపల్ డాక్టర్ డి.కళ్యాణి అభినందించి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న గూడూరి ఎరిక్షన్‌బాబు

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

త్రిపురాంతకంలోని శ్రీ బాల త్రిపుర సుందరిదేవి ఆలయంలో ఈ నెల 3 నుంచి దసరా శరన్నవరాత్రులు ప్రారంభం కానున్నాయి. అందులో భాగంగా దసరా శరన్నవరాత్రులకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను టిడిపి యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రులు సంధర్భంగా త్రిపురాంతకం వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహణాధికారి చెన్నకేశవరెడ్డి, టిడిపి నాయకులు వలరాజు, గొట్టం శ్రీనివాసరెడ్డి, నాసర్‌రెడ్డి, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి- కొమరోలు

బైకు గేదెను ఢీకొని అదుపు తప్పి బోల్తా కొట్టిన ఘటనలో ఓ వ్యక్తి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని తాటిచెర్ల మోటు గ్రామ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని కత్తులవాని పల్లె గ్రామానికి చెందిన వై. మల్లికార్జున తాడిచెర్ల మోటు వద్ద పని ముగించుకొని బైకుపై ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో బైకు గేదెలను ఢీకొని బోల్తా కొట్టింది. దీంతో మల్లికార్జునకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకుకు తరలించారు.

ట్రైసైకిల్ అందజేత

ప్రజాశక్తి-చీమకుర్తి

స్థానిక భవిత కేంద్రంలోని వికలాంగ విద్యార్థి ట్రైసైకిల్ మంగళవారం అందజేశారు. జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సమకూర్చిన ట్రైసైకిల్‌ను ఎంఇఒ కె.శివాజీ చేతుల మీదుగా విద్యార్థికి అందజేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణతో చదవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం రిసోర్స్‌పర్సన్ జానీ ,సిఆర్‌పిలు బొడ్డు ఏడుకొండలు,వేమా వెంకటరావు, విక్టోరియారాణి, ఎంఐఎస్ కోఆర్డినేటర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ముగిసిన స్వచ్ఛభారత్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి -కొమరోలు

బకాయి జీతాలు చెల్లించాలని కోరుతూ స్వచ్ఛభారత్ కార్మికులు చేపట్టిన 36 గంటల ధర్నా మంగళవారంతో ముగిసింది. కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం నుంచి 36 గంటల ధర్నా నిర్వహించారు. అదే విధంగా జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. దీంతో స్పందించిన అధికారులు త్వరలో బకాయి జీతాలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో కార్మికులు ధర్నా ముగించారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం ర్యాలీ నిర్వహించనున్నట్లు కార్మికులు తెలిపారు.

ధర్నా నిర్వహిస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులు

మద్యం దుకాణాలు మూసి నిరసన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విధులు నిర్వహిస్తున్న సేల్స్‌మెన్‌లు, సూపర్ వైజర్లు మంగళవారం నిరసన తెలిపారు. మధ్యాహ్నం నుంచి బ్రాందీ షాపులను మూసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు విలియం కేరీ, అహరోన్, మాట్లాడుతూ తమకు ఉద్యోగ భద్రత లేని కారణంగా కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ జీవోలో ఇచ్చిన ప్రకారం తమకు రావాల్సిన బకాయిలు మంజూరు చేయాలన్నారు. నూతన పాలసీ విధానంలో ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణాలలో తమకు విధులు నిర్వహించే అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాములు నాయక్, సురేష్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మూత వేసిన మద్యం దుకాణం

మామిడితోటల పునరుద్ధరణపై అవగాహన

ప్రజాశక్తి-టంగుటూరు

జరుగుమల్లి గ్రామంలో మామిడి తోటల పునరుద్ధరణపై రైతులకు మంగళవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శి ఉద్యాన పరిశోధన కేంద్రం సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ రవీంద్రబాబు మాట్లాడుతూ మామిడి తోటల్లో కొమ్మ కత్తిరింపులు మరియు 20 సంవత్సరాల కన్నా పైబడిన మామిడి తోటలలో పునరుద్ధరణ చర్యల గురించి వివరించారు, పనికి రాని కొమ్మలు,ఎండు కొమ్మలు కత్తిరించి సూర్య రస్మి అందేలా చెట్టును గొడుగు అకారంలో తయారు చేయాలన్నారు. దీంతో గాలి చక్కగా అంది చీడ, పీడలు తగ్గి మంచి దిగుబడి వస్తుందన్నారు. కొమ్మలు కత్తిరించిన తరువాత బ్లీటొక్స్ 3 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి గోపి చంద్ , ఉద్యానశాఖ అధికారి డి.ప్రత్యూష, ఎఒ డి.యుగంధర్ రెడ్డి, జిల్లా వనరుల అధికారి ఎఒ శైలజ , పశు వైద్య అధికారి డాక్టర్ శ్రావణి, గ్రామ ఉద్యాన అధికారులు శ్రీను, రామస్వామి రైతులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న ఎంపిడిఒ

పారిశుధ్య కార్మికులకు సన్మానం

ప్రజాశక్తి-శింగరాయకొండ

స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా శింగరాయకొండ మండల పరిషత్ కార్యాలయంలో మూలగుంట పాడు పంచాయతీ కార్మికులను ఎంపిడిఒ డి.జయమణి ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి టి.సుధాకర్, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ సి హెచ్.సుధాకర్‌రావు, మూలగుంటపాడు గ్రామపంచాయతీ కార్యదర్శి రామారావు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

బీజామృతంతో విత్తనశుద్ధి

ప్రజాశక్తి- కొత్తపట్నం

గ్రామ సమైక్య ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వరి విత్తనాలను బీజామృతంతో విత్తనశుద్ధి చేసినట్లు లెవెల్ వన్ మండల్ అధికారి రెడ్డప్ప తెలిపారు. ప్రకతి వ్యవసాయ పద్ధతిలో విత్తనాలను శుద్ధి చేయడం ద్వారా విత్తనం సంపూర్తిగా మొలక వస్తుందన్నారు. మొక్క ఎదుగుదల బాగా ఉంటుందని, తెగుళ్లను ఎదుర్కొంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిఆర్‌పిలు పట్టపు సురేష్, పట్టపు ప్రవీణ్ , బద్దెపూడి రాజశేఖర్ పట్టపు సునీత, పత్రా శశి, రైతులు ప్రసన్న, భూషణం ,ప్రభాకర్ ,ఆదాం, అబ్రహం పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలపై సమీక్ష

ప్రజాశక్తి-కొండపి

గృహ నిర్మాణాల్లో పురోగతి పెరిగేలా అధికారులు కృషి చేయాలని, ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని మండల ప్రత్యేక అధికారి , హౌసింగ్ పీడీ పి.శ్రీనివాసప్రసాదు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ప్రతి ఇంటికి ప్రభుత్వం పథకం అందేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డిఇ సత్యనారాయణ , ఇన్‌ఛార్జి ఎంపిడిఒం రామకృష్ణ, హౌసింగ్ ఎంఇ పి.భూపతి, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

చీరాల ఆర్‌డీవో సూర్యనారాయణ రెడ్డి

మాట్లాడుతున్న ఆర్‌డీవో సూర్యనారాయణరెడ్డి

ప్రజాశక్తి - పంగులూరు

పంగులూరు మండలంలో భూసమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కృషి చేస్తున్నట్లు చీరాల ఆర్డీవో సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో ప్రధానంగా ఇప్పటివరకు రెండు భూ సమస్యలు వచ్చాయని, వాటిని వీలైనంత త్వరలో పరిష్కరించేందుకు రెవెన్యూ సిబ్బంది తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మండలంలోని చందలూరు గ్రామంలో సర్వేనెంబర్ 737లో 28 ఎకరాల 62 సెంట్లు గ్రామ కంఠం ఉందని, ఈ భూమిలోనే గ్రామం మొత్తం ఉందని అని చెప్పారు. అయితే ఇందులోనే మూడు దేవస్థానాలకు చెందిన 17 సెంట్లు భూమి కూడా ఉందని, ఈ భూమిని ఇంతవరకు సబ్ డివిజన్ చేయలేదని చెప్పారు. దేవాలయాలకు చెందిన 17 సెంట్లు భూమిని సబ్ డివిజన్ చేయని కారణంగా, గ్రామంలో ఇల్లు గాని, ఇళ్ల స్థలాలు గాని కొనుగోలు, అమ్మకాలు జరపటానికి వీలు లేకుండా పోయిందని చెప్పారు. ఈ సమస్య గత ఎనిమిది సంవత్సరాల నుండి ఉందని, అప్పటినుండి గ్రామస్తులు అనేక రకాలుగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాలంటే దేవాలయాలకు చెందిన 17 సెంట్లు భూమిని సబ్ డివిజన్ చేసి, గ్రామ కంఠం నుండి విడగొట్టాలని అలా చేసినప్పుడు గ్రామంలోని ఇల్లు, ఇళ్ల స్థలాలు అమ్మకాలు, కొనుగోలు జరుపుకోవడానికి అవకాశం జరుగుతుందని చెప్పారు. తక్షణమే సమస్యను పరిష్కారం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సూర్యనారాయణ రెడ్డి చెప్పారు. తూర్పు తక్కెలపాడు గ్రామంలో 57 మంది రైతులకు చెందిన 60 ఎకరాల భూమి రైతు వారి పట్టాలు లేకపోవడం వలన భూమి వారి చేతిలో ఉన్నా దానిపై హక్కులు లేవని ఆర్డీవో సూర్యనారాయణ రెడ్డి చెప్పారు. ఈ భూమి 1962లో ఎఫ్ఎల్ఆర్‌లో పెండింగ్ అని రాసి ఉండటం వలన, ఆ భూమిని రైతులకు సెటిల్మెంట్ చేయలేదని, అందువలన వారికి రైతు వారి పట్టాలు ఇవ్వలేదని చెప్పారు. ఆ భూమిని సర్వే చేసి విచారణ జరిపి, జాయింట్ కలెక్టర్‌కు రిపోర్ట్ పంపాలని, మరలా జాయింట్ కలెక్టర్ విచారణ జరిపి ఆయన సెటిల్మెంట్ చేసి, రైతు వారి పట్టాలు ఇవ్వాల్సి ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ డి.నాగరాజు రావు ఉన్నారు.

104 సిబ్బందితో డాక్టర్ ప్రవీణ్

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

విధుల్లో అలసత్వం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్యసేవ బాపట్ల జిల్లా సమన్వయకర్త డాక్టర్ ప్రవీణ్ హెచ్చరించారు. మంగళవారం మార్టూరు సచివాలయం-2 సమీపంలో యద్దనపూడి ఆరోగ్యకేంద్రం వైద్య సిబ్బంది విధులు నిర్వహిస్తున్న 104 వాహనాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనంలోని పరికరాలను, ల్యాబ్‌లో చేస్తున్న వైద్య పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్యసేవల ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తుందని తెలిపారు. 104 సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీన, 104 జిల్లా మేనేజర్ జె.నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి - పర్చూరు

పర్చూరు మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల పోస్టులకు 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పర్చూరు సీడీపీఓ సుభద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని చిన్ననందిపాడులో అంగన్‌వాడీ కార్యకర్త, వీరన్నపాలెం, పర్చూరు, దేవరపల్లి గ్రామాల్లో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు 10వ తరగతి, ఆయాలకు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అన్ని పోస్టులకు 01-07-2024 నాటికి వయసు 21 నుండి 35 సంవత్సరాలలోపు ఉండాలని తెలిపారు. దరఖాస్తు దారులు పోస్టు ఖాళీగా ఉన్న గ్రామ పరిధిలో నివాసం ఉంటూ వివాహిత మహిళ అయి ఉండాలన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పౌరహక్కుల సంఘం సభ్యులు

డప్పు కళాకారుడు ఉన్నం సంస్మరణ సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

నాలుగు దశాబ్దాలుగా ప్రజా కళామండలి కళాకారుడిగా, డప్పు, దరువుతో, పాటలతో ప్రజలను అలరించిన కామ్రేడ్ ఉన్నం సంస్మరణ సభను జయప్రదం చేయాలని పౌర హక్కుల సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా సంయుక్త కార్యదర్శి చికిలం చిన్న కోరారు. మంగళవారం మార్టూరులోని గన్నవరం రోడ్డులో పౌరహక్కుల సంఘం సభ్యులు బొల్లాపల్లి బెన్ని బాబు ఆధ్వర్యంలో ఉన్నం నాగేశ్వరరావు సంస్మరణ సభ కరపత్రాన్ని చిన్న ఆవిష్కరించారు. ఈ నెల 6న సత్తెనపల్లి సమీపంలోని వడ్డేపల్లిలో జరగనున్న ఉన్నం సంస్మరణ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సభలో ప్రజా కళాకారులు, రచయితలు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ సనావుల్లా, మౌలాలి, గొట్టిపాటి పవన్ కుమార్, శేషు, విజయకుమార్ పాల్గొన్నారు.

బస్సులో మరిచిపోయిన మొబైల్ అప్పగింత

ప్రజాశక్తి-ఇంకొల్లు

మండలంలోని కొనికి గ్రామానికి చెందిన మురళి మొబైల్ వదిలి పర్చూరులో బస్సు దిగి వెళ్లిపోయాడు. బస్సు దిగిన తరువాత సెల్‌ఫోన్ బస్సులో వదిలేసిన విషయం గుర్తుకు వచ్చి ఇంకొల్లు కంట్రోలర్ ఎస్కె బాబుకు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న కంట్రోలర్ బస్సు పర్చూరు నుండి ఇంకొల్లు వచ్చిన తర్వాత బస్సులోని ప్రయాణికుల వద్ద నుంచి తీసుకొని మురళికి అందజేశారు.

ఆంధ్రా ఉద్యమానికి బాపట్లలోనే బీజం

అడిషనల్ ఎస్పీ విరలేశ్వర్

ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం

తెలుగు తల్లికి నివాళులర్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి బాపట్ల

ఆంధ్రా ఉద్యమానికి బాపట్లలోనే బీజం పడిందని జిల్లా అడిషనల్ ఎస్పీ పి.వి.విరలేశ్వర్ అన్నారు. మంగళవారం రాష్ట్ర 71వ అవతరణ దినోత్సవ సందర్భంగా ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విరలేశ్వర్ మాట్లాడుతూ ఆంధ్రుల స్వరాష్ట్ర వాంఛకు ఇక్కడే బీజం పడిందన్నారు. 1913లో బాపట్లలో జరిగిన ప్రథమాంధ్ర మహాసభ నాలుగు దశాబ్దాల ఆంధ్రోద్యమానికి నాంది పలికిందని తెలిపారు. తెలుగువారి ఐక్యతకు అది ఫూతమిచ్చిందన్నారు. టౌన్ హాల్ లో జరిగిన మహాసభలు భాషా ప్రయుక్త రాష్ట్ర వాదనకు శ్రీకారం చుట్టాయన్నా రు. ఈ కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి పిసి సాయిబాబు మాట్లాడుతూ బాపట్ల సభలు ఆంధ్రరాష్ట్ర అవతరణకు పునాదిగా నిలిచాయన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ స్థాపనకు కూడా ఇక్కడే బీజం పడిందన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణంతో ఆంధ్ర రాష్ట్రం సిద్ధించిందని తెలిపారు. బాపట్ల ప్రాంతానికి చెందిన సమరయోధులు స్వామి సీతారాం ఆంధ్ర రాష్ట్రం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఏ వి రమణారావు, అధ్యాపకులు కలాం, పౌర సమాఖ్య నాయకులు కె.విజయకుమార్, రమణ కుమార్, యు.వి.రామారావు, గుండ్రెడ్డి సత్యనారాయణ, రచయిత్రి చిల్లర భవానీ దేవి, మానం అప్పారావు, ఏవివి హై స్కూల్ హెచ్ఎం ఎడ్ల సత్యవతి, కరణం రవీంద్రబాబు, సత్యనారాయణ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ భవనానికి

స్థలం కేటాయింపునకు కృషి చేస్తా

మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్

మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్

ప్రజాశక్తి-బాపట్ల

భావపురి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ భవనానికి స్థలం కేటాయింపునకు తమ వంతు కృషి చేస్తానని బాపట్ల మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్ అన్నారు. మంగళవారం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా భావపురి సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో ఎన్జీవో హోంలో నిర్వహించిన కార్యక్రమానికి కమిషనర్ నిర్మల్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ సూచనల మేరకు భావపురి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ భవనానికి స్థల సేకరణకు చర్యలు తీసుకుంటామన్నారు. పర్యావరణహితంగా పట్టణాన్ని తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారంతో పాటు సీనియర్ సిటిజన్స్ సలహాలు సూచనలు అవసరమన్నారు. ప్రధానంగా పట్టణంలో ప్లాస్టిక్ నియంత్రణకు ప్రజలు సహకరించాలన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను ప్రజల్లో ప్రచారం నిర్వహించాలన్నారు. అందుకు సీనియర్ సిటిజన్స్ ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాల్లో భాగంగా ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణ ముప్పుతో భావితరాలకు కలిగే అనర్థాలపట్ల ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత సీనియర్ సిటిజన్స్‌పై ఉందన్నారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ సిటిజన్స్ ను అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమానికి భావపురి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కాగిత శ్రీహరి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కెవిఎస్‌టి సాయి, ప్రముఖ వైద్యులు కేసన వెంకట నరేంద్ర, జిల్లా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు జివి బ్రహ్మం, పిసి సాయిబాబు, బందా బాబు, ప్రముఖ వైద్యులు కవి డాక్టర్ శ్రీనివాస్, విశ్రాంత తహశీల్దార్ సిద్దయ్య, ప్రముఖ కవి పులుగు చిన వీర రాఘవులు, పలువురి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

జడ్‌పి చైర్మన్ దంపతులను సత్కరిస్తున్న మంత్రి అనగాని

రెవెన్యూ మంత్రిని కలిసిన జడ్‌పి చైర్మన్ దంపతులు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ని సచివాలయంలోని ఆయన చాంబర్లో మంగళవారం మధ్యాహ్నం ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెర హెని క్రిస్టిన, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ కలిశారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని సత్య ప్రసాద్‌కు పుష్పగుచ్చాన్ని అందించారు. వీరి మధ్య పలు విషయాలపై చర్చలు జరిగాయి. అదేవిధంగా కత్తెర దంపతులను మంత్రి శాలువాతో సత్కరించారు.

కారంచేడు ఎంపీడీవోగా నేతాజీ

ఎంపీడీవో నేతాజీ

ప్రజాశక్తి-కారంచేడు

కారంచేడు ఎంపీడీవోగా కె.నేతాజీ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. చీరాల నియోజకవర్గంలోని వేటపాలెం చీరాల ప్రాంతాల్లో సుదీర్ఘకాలంగా సేవలందించిన ఈయన ఎన్నికల అనంతరం జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా కారంచేడు మండలానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ కారంచేడు మండల అధికారులందరినీ సమన్వయం చేసుకొని అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

చెట్టుకు వేలాడుతున్న ఎసమ్మ మృతదేహం

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - చీరాల

వ్యక్తి ఉరి వేసుకొని అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన చీరాల మండలం కొత్తపాలెం యానాది కాలనీలో మంగళవారం జరిగింది. అందిన వివరాల మేరకు.. బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం, నరాల పాలెం పంచాయతీకి చెందిన మరక ఏసమ్మ (50) గత నాలుగు నెలల క్రితం గవినివారిపాలేనికి చెందిన ఓ వ్యక్తి వద్ద గొర్రెల కాపరిగా వచ్చి జీతానికి పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్తపాలెం గ్రామానికి చెందిన ఓ పొలంలో సుమారు 20 రోజుల నుండి గొర్రెలు కాస్తూ ఉన్నాడు. అయితే మంగళవారం ఉదయం కొత్తపాలెం పొలాల్లోని జీడి చెట్టుకు తాడుతో వేలాడుతూ మృతి చెంది కనిపించారు. దీంతో స్థానికుల సమాచారంతో ఒకటో పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతి పట్ల మృతుని కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేయడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చెకుముకి సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు

భవిష్యత్‌లో శాస్త్రవేత్తలుగా రాణించాలి

ప్రజాశక్తి-మార్కాపురం

విద్యార్థులు భవిష్యత్ శాస్త్రవేత్తలుగా రాణించాలని మార్కాపురంలోని జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.చంద్రశేఖరరెడ్డి ఆకాంక్షించారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మార్కాపురం పట్టణం మరియు మండల స్థాయి చెకుముకి సంబరాల పరీక్షలు మంగళవారం నిర్వహించారు. ఈ చెకుముకి మండల స్థాయి సంబరాల పరీక్షా పత్రాలను స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖర్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఓద్దుల వీరారెడ్డి, జి.రమేష్, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు ఆర్‌ఎం ఝాన్సీపాల్, ఏనుగుల రవికుమార్ పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు నిర్వహించిన మండల స్థాయి జనవిజ్ఞానవేదిక చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నందు కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి కె వర్షా, తొమ్మిదో తరగతికి చెందిన సిహెచ్ వెంకట ధనుష్ ఆదిత్య, ఎనిమిదో తరగతికి చెందిన ఆర్ గోవింద్ సింగ్‌లు మండల స్థాయిలో మొదటి స్థానం సాధిచారు. ప్రభుత్వ పాఠశాలల్లో మొదటి బహుమతిని యర్రగొండపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, 2వ బహుమతి యర్రగొండపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, 3వ బహుమతి వీరభద్రాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెలుచుకున్నాయి. కార్యక్రమంలో జెవివి జిల్లా కార్యదర్శి డి బాలు నాయక్, మండల అధ్యక్షుడు ఎస్ శ్రీనివాసులు, జడ్పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పిచ్చిరావు పాల్గొన్నారు.

డీఏపీని అందుబాటులోకి తీసుకురావాలి

అధికారులను ఆదేశించిన మంత్రి గొట్టిపాటి

ప్రజాశక్తి-పంగులూరు

రైతులకు ఇబ్బంది లేకుండా.. వారికి అవసరమైనంత డీఏపీ ఎరువును అందుబాటులోకి తీసుకురావాలని, అవసరమైతే సొసైటీల ద్వారా, రైతు సేవా కేంద్రాల ద్వారా కూడా డీఏపీని రైతులకు అందించాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పంగులూరులోని మండల పరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాల ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, అధికారులతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా కొంతమంది రైతులు డీఏపీ ఎరువు తగినంతగా అందుబాటులో లేదని, అందువలన ఇబ్బంది పడుతున్నామని మంత్రికి తెలిపారు. మంత్రి గొట్టిపాటి వెంటనే మండల వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారెడ్డిని పిలిచి.. డి.ఎ.పి. కొరత ఏర్పడటానికి కారణం ఏమిటని అడిగారు. రూ.1300కు మించి డి.ఏ.పీ ని అమ్మటానికి లేదని నిబంధన పెట్టడంతో, బయట షాపుల వాళ్లు తీసుకురావడం లేదని, అందువలన రైతులు అవసరాలకు తగినంతగా దొరకడం లేదని చెప్పారు. వెంటనే వ్యవసాయ శాఖ జిల్లాస్థాయి అధికారులతో మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. వెంటనే డిఎపి కొరత లేకుండా చూడాలని చెప్పారు. పొగాకు నాట్ల సీజను ప్రారంభమైందని, సాగర్ నీరు రాకపోవడం వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారని తూర్పు కొప్పెరపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు పూనాటి రామాంజనేయులు మంత్రి రవికుమార్‌కు వివరించారు. సిబ్బంది ఇటీవల కాలంలో బదిలీ అయ్యారని, తగినంత సిబ్బంది లేకపోవడం వల్లనే ఇబ్బంది వస్తుందని చెప్పారు. మంత్రి రవికుమార్ జోక్యం చేసుకొని ఎన్‌ఎస్‌పి ఎస్‌సిని వెంటనే తనతో మాట్లాడమని ఆదేశించారు. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో గృహ నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం నుండి అకౌంట్‌లలో ఒక రూపాయి గానీ, పది రూపాయలు కానీ జమ అయిన లబ్ధిదారులందరికీ బిల్లులు చేయించేందుకు వెంటనే వారి వివరాలను పంపాలని, గృహ నిర్మాణ శాఖ మండల ఏఈ కిషోర్ కుమార్‌ను మంత్రి ఆదేశించారు. గతంలో ఆగిపోయిన గృహ లబ్ధిదారులందరికీ బిల్లులు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో చీరాల ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి, పంగులూరు తాసిల్దార్ డి. నాగరాజారావు, ఎంపీడీవో బి. రామాంజనేయులు, మాజీ డైరీ చైర్మన్ బాలిన రామ సుబ్బారావు, మాజీ జెడ్పిటిసి లు కర్రి వెంకట సుబ్బారావు, బాచిన చెంచు ప్రసాద్, తెలుగుదేశం పార్టీమండల అధ్యక్షుడు రావూరి రమేష్ బాబు, మండల నాయకులు కుక్క పల్లి ఏడుకొండలు, చింతల సహదేవుడు, బొరెడ్డి ఓబుల్ రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్ రెడ్డి, గుర్రం ఆదిశేకర్, గుదిబండ్ల ఆదిరెడ్డి, గొట్టిపాటి కాజా స్వామి పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి గొట్టిపాటి

అంబేద్కర్ విగ్రహానికి జలాభిషేకం చేస్తున్న కమిషనర్, మేయర్

మహనీయుల విగ్రహాలకు జలాభిషేకం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ అధికారులు మంగళవారం నగరంలోని మహనీయుల విగ్రహాలకు జలాభిషేకం నిర్వహించారు. స్థానిక బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ వద్ద ఉన్న మహాత్మగాంధీ విగ్రహానికి, హెచ్‌సిఎం సెంటర్‌లో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ కె వెంకటేశ్వరరావు జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ మనోహర్‌రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ ఎన్.పిచ్చయ్య, ఇన్స్‌పెక్టర్ షేక్ బాజ్జీ పాల్గొన్నారు.

పింఛన్ అందజేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ప్రతి నెలా ఒకటో తేదీ ప్రభుత్వం ద్వారా అందించే సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక 15వ డివిజన్ రాంనగర్, అన్నవరప్పాడు ప్రాంతాలలో జరిగిన ఫించన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొన్నారు. పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు. పలువురు లబ్ధిదారులకు ఫించన్లు అందజేశారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ కె వెంకటేశ్వరరావు, 15వ డివిజన్ కార్పొరేటర్ చింతపల్లి గోపి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గంజివారిపల్లిలో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని గంజివారిపల్లి, వెంకటాద్రిపాలెం గ్రామాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు సేవ కేంద్రం పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కెవి శేషారెడ్డి, ఉద్యాన అధికారి పి ఆదిరెడ్డి, వెంకటాద్రిపాలెం సర్పంచ్ బోడా శ్రీశైలపతి నాయుడు, ఏఈఓ యల్ మాల్యాద్రిరెడ్డి పాల్గొన్నారు.



ఎస్ఐ చౌడయ్యను సన్మానిస్తున్న నాగయ్య

ఎస్ఐ చౌడయ్యను కలిసిన నాగయ్య

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం నూతన ఎస్సైగా వచ్చిన పి చౌడయ్యను ఏపీ జెఎసి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆలేటి నాగయ్య మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమాలలు, శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెఎసి ఉద్యోగుల సంఘం నాయకులు ముళ్ళ సుబ్బయ్య, రాము నాయక్, చెన్నయ్య, పి.సురేష్, డి.లక్ష్మి పాల్గొన్నారు.

ఉచిత ఇసుక విధానాన్ని అమలుచేయాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఉచిత ఇసుక విధానాన్ని అమలు పరచాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షులు షేక్ పీరా ఆధ్వర్యంలో మంగళవారం తహశిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం తహశిల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్‌కు అర్జీ అందజేశారు.

మేస్త్రీలు కాదు..కార్మికులే..

- తేల్చిచెప్పిన ఒంగోలు కార్పొరేషన్ కమిషనర్
- వైట్‌కాలర్ జాబ్ కాదని.. పని చేయాలని ఆదేశం
- పర్యవేక్షణ పనైతేనే చేస్తామంటున్న మేస్త్రీలు
- పారిశుధ్య పనికి పోని వారికి వారం రోజులుగా ఆబ్‌సెంట్ వేస్తున్న అధికారులు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరపాలక సంస్థ శానిటేషన్ విభాగంలో మేస్త్రీలుగా పనిచేస్తున్న వారికి కార్పొరేషన్ అధికారులు షాక్ ఇచ్చారు. జాబ్‌చార్ట్ ప్రకారం మేస్త్రీ అనే పోస్టు లేదని వాళ్లు పారిశుధ్య కార్మికులే అని.. పని చేయాల్సిందేనని కార్పొరేషన్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. పారిశుధ్య పనులు చేసేందుకు ముందుకు రాని మేస్త్రీలకు గత వారం రోజులుగా ఆబ్‌సెంట్ వేస్తున్నారు. కార్పొరేషన్ వర్గాలలో ఈ వ్యవహారం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది.

కార్పొరేషన్ పారిశుధ్య విభాగంలో కార్మికులు చేసే పనిని పర్యవేక్షించేందుకు మేస్త్రీల వ్యవస్థను గతంలో పాలకులు, అధికారులు అనధికారికంగా ఏర్పాటుచేశారు. ఈ వ్యవస్థలో సుమారు 106 మంది పనిచేస్తున్నారు. సుమారు గత రెండున్నర దశాబ్దాలుగా ఈ వ్యవస్థ కొనసాగుతోంది. కార్మికులు పనిచేసే ప్రదేశాలకు వెళ్లి వారు చేస్తున్న పనిని పర్యవేక్షించడమే వీరి పని. చెత్తతీయడం, కాల్వలు తీసే పని చేయమని ప్రస్తుత కార్పొరేషన్ అధికారులు చెప్పడంతో ఇప్పటిదాకా పర్యవేక్షణ చేసిన తాము.. ఆ పనులు ఎలా చేస్తామంటూ.. మేస్త్రీలుగా ఉన్న వారు విధులకు వెళ్లడం లేదు. విధులకు రాని వారికి అధికారులు ఆబ్‌సెంట్ వేస్తున్నారు.

కొత్త కమిషనర్ రాకతో మారిన పరిస్థితులు..

నగరపాలక సంస్థ నూతన కమిషనర్‌గా కె వెంకటేశ్వరరావు గత నెలలో బాధ్యతలు స్వీకరించారు. పారిశుధ్య పనులను ఆయన ప్రతిరోజూ పర్యవేక్షణ చేస్తున్నారు. ఈ క్రమంలో మేస్త్రీల వ్యవస్థ మీద ఆయన సంచలన నిర్ణయం తీసుకున్నారు. గత ప్రభుత్వం నెలకొల్పిన సచివాలయ వ్యవస్థలో సచివాలయాల వారీగా శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీ పోస్టును ఏర్పాటుచేసి భర్తీ చేశారు. వీరు నగరంలోని 70 సచివాలయాల పరిధిలో 70 మంది పనిచేస్తున్నారు. వీరి డ్యూటీ కూడా పారిశుధ్య పనులను పర్యవేక్షణ చేయడమే.. పారిశుధ్య పనులను పర్యవేక్షణ చేసేందుకు సచివాలయాల వారీగా ప్రభుత్వ ఉద్యోగులు ఉండటంతో మేస్త్రీలు అవసరం లేదనేది అధికారుల వాదన. దీంతో నూతన కమిషనర్ వెంకటేశ్వరరావు మేస్త్రీల వ్యవస్థను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. మేస్త్రీలుగా పనిచేస్తున్న వారు పారిశుధ్య పనులు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మేస్త్రీలు అవసరం లేదని తేల్చిచెప్పారు. దీంతో కొత్త కమిషనర్ రాకతో మేస్త్రీలు గందరగోళంలో పడ్డారు.

పర్యవేక్షణ చేసిన చోట పనిచేయాలంటే ఎలా...?

ఇన్నాళ్లు కార్మికుల పనిని పర్యవేక్షణ చేసిన చోట ఇప్పుడు అదే కార్మికులతో కలిసి పనిచేయమని చెప్పడం భావ్యం కాదనేది మేస్త్రీల వాదన. కమిషనర్ నిర్ణయాన్ని పలువురు మేస్త్రీలు తప్పుపడుతున్నారు.. మేస్త్రీలలో కొంత మంది ఆ ఉద్యోగానికి రాజకీయ నాయకుల సిఫార్సులతో వచ్చిన వారు ఉంటే కొంత మంది ఏకంగా లక్షల రూపాయలు ముట్టజెప్పి పనిలో చేరిన వారు కూడా ఉన్నారు. వీరిని ఇప్పుడు పారపట్టమని చెప్పడంతో వాళ్లు అధికారుల నిర్ణయం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రాజకీయ వర్గాలలో చర్చ..

మేస్త్రీలుగా ఉన్న వారు పారిశుధ్య పనుల్లోకి పోవాలని, ఆపని చేయకపోతే ఇంటికి పోవాలని కమిషనర్ తేల్చి చెప్పడం కార్పొరేషన్ రాజకీయ వర్గాలలో చర్చనీయాంశంగా మారింది. ఈ మేస్త్రీల పోస్టులలో కార్మికుల నియామకం అంతా ఎక్కువ శాతం గతంలో టిడిపి, వైసిపి నాయకుల సిఫార్సులతోనే జరిగింది. దీంతో మేస్త్రీలుగా ఉన్న కార్మికులు తమ పరిస్థితి కాస్త పట్టించుకోండని నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మేస్త్రీల విషయంలో అధికారులు నిబంధనలను తెరమీదకు తెస్తుండటంతో ఏం చేయాలో పాలుపోక నేతలు కూడా ప్రస్తుత పరిస్థితులను మౌనంగా పరిశీలన చేస్తున్నారు.

కార్మికుల పొట్టకొట్టే ఉద్దేశం లేదు..

కె.వెంకటేశ్వరరావు, కమిషనర్, ఒంగోలు కార్పొరేషన్

పారిశుధ్య పనుల్లో మేస్త్రీలు అనే పోస్టు లేదు. కాబట్టి వారు మాకు అవసరం లేదు. వారి జాబ్‌చార్ట్ ప్రకారం పారిశుధ్య కార్మికులుగా నమోదు చేయబడి ఉన్నారు. కాబట్టి వారిని ఆ పని చేయమని చెబుతున్నాం. పారిశుధ్య కార్మికుల పనిని పర్యవేక్షించేందుకు ప్రభుత్వం సచివాలయాల వారీగా ఉద్యోగులను నియమించింది. కొంతమంది మేస్త్రీలమని చెప్పుకుంటూ వైట్ కాలర్ జాబ్ చేస్తున్నారు. పేరుకు వందమందికి పైగా ఉన్నా వారిలో సుమారు 40 మంది అస్సలు ఎలాంటి పనిచేయకుండా జీతాలు తీసుకుంటున్నట్లు గుర్తించాం. కార్మికుల పొట్టకొట్టడం మా ఉద్దేశం కాదు. అందుకే వారిని పనిలో నుంచి తీసేయడం లేదు. పారిశుధ్య పనులు చేయమని చెబుతున్నాం. ఇన్నాళ్లు మేస్త్రీలుగా పనిచేసిన చోట కార్మికులుగా పనిచేయడం ఇబ్బందిగా ఉంటే గ్యాంగ్‌వర్క్‌కు కొంతమందిని, నైట్ శానిటేషన్‌కు కొంత మందిని పొమ్మని చెబుతున్నాం. ఇష్టం ఉన్నవారు పని చేస్తారు. లేనిపక్షంలో వారి స్థానంలో వేరే వారిని పారిశుధ్య కార్మికులుగా విధుల్లోకి తీసుకొని పనిచేయిస్తాం.

ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి వాలీబాల్ జట్టుకి ఎంపిక

ప్రజాశక్తి- వేటపాలెం

సంతనూతలపాడు నియోజకవర్గం పేర్నమిట్ట హైస్కూల్‌లో జరిగిన ఉమ్మడి ప్రకాశం జిల్లా స్కూల్ గేమ్స్, అండర్ 14 వాలీబాల్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకులం పాఠశాల చీరాల 9వ తరగతి విద్యార్థి కె. శ్యాం కుమార్ ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి అండర్14 బాల,బాలికల విభాగంలో పోటీ పడుతున్నట్లు స్కూలు పిఈటి రాజు మంగళవారం తెలియజేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ పిల్లలకు చదువుతోపాటు ఆటపాటల్లోనూ ప్రతిభ కనబరిచే విధంగా తీర్చిదిద్దుతున్నామన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన పెసర్లంక విద్యార్థులు

సత్తా చాటిన పెసరలంక విద్యార్థులు

ప్రజాశక్తి- వేమూరు

ఎస్‌జిఎఫ్ క్రీడలలో కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్‌లలో పెసర్లంక డీకే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మహబూబ్ బాషా, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు దాసరి వెంకట ప్రసాద్ విద్యార్థులను అభినందించారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-మేదరమెట్ల

అద్దంకి నియోజకవర్గం స్థాయిలో జరిగిన పోటీలలో మంగళవారం మేదరమెట్ల హై స్కూల్ బాల బాలికలు వివిధ భాగాలలో సత్తా చాటారు. అండర్ 17 విభాగంలో 200 మీటర్లకు జరిగిన పోటీలో ఏ.శ్రీను, అండర్ 14 విభాగంలో యోగాలో జరిగిన పోటీలలో పి.శరణ్య, ఫాతిమా, ఎస్. సిరి, జి.సంతోష్‌లు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. అండర్ 17 విభాగంలో యోగాలో ఎన్.అజీమ్, జె.శ్రీకాంత్, కోకో విభాగంలో అండర్ 14లో బి.రెబక, కబడ్డీలో బి.బాల త్రిపుర, సిహెచ్.దీవెన జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. అండర్ 17 హ్యాండ్ బాల్ విభాగంలో కె.యశ్వంత్ అండర్ 14 విభాగంలో పి.హరిణిలు రాష్ట్రస్థాయికి ఎన్నిక అయినట్లు మేదరమెట్ల పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు జి.జ్వాలలక్ష్మమ్మ తెలిపారు.

మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - పర్చూరు

రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూర్ సెంట్రల్ ఆధ్వర్యంలో తలసీమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కీర్తిశేషులు తోకల నాగయ్య, సుబ్బాయమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి మనవడు కొమ్మాలపాటి మనోజ్ కుమార్, లక్ష్మీ సుమ దంపతుల ఆర్థిక సహాయంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాయల శ్రీనివాసరావు, ఆత్మీయ అతిథిగా తేళ్ళ రమేష్ చంద్ర, అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్, కార్యదర్శి కోమటి ఆంజనేయులు మరియు రోటరీ సభ్యుల సహకారంతో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మొత్తం 50 మంది రక్తదానం చేశారు. తలసీమియా యూనిట్ ఇంచార్జీ శివాజీ హాజరయ్యారు. కార్యక్రమంలో సభ్యులు పి.సదానంద రెడ్డి, కోట శ్రీనివాసరావు, పాబోలు ఉదయభాస్కర్, గడ్డిపాటి శ్రీనివాసరావు, కాల్వ సత్యనారాయణ, పాబోలు వెంకన్న, కొల్లా సుబ్బారావు, ఆకుల వెంకటేశ్వరరావు, భవనం రాజగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేస్తాం

ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ

లబ్ధిదారులకు అర్హత పత్రాలు అందజేత

ప్రజాశక్తి-బాపట్ల

అర్హులైన ప్రతి ఒక్కరికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేస్తామని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. మంగళవారం బాపట్ల ఏరియా వైద్యశాలలో జరిగిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ స్కీమ్ అర్హత ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరేంద్ర వర్మ మాట్లాడుతూ పెన్షన్ అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించిన రూ.4 వేలు ఒకేసారి అందజేసిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదేనన్నారు. మాది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం అని నిరూపించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ సిద్ధార్థ, బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు బొంతు శివ సాంబిరెడ్డి, జనసేన సమన్వయకర్త నామన శివన్నారాయణ, పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు ఆసుపత్రి సిబ్బంది, లబ్ధిదారులు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పింఛను అర్హత పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ

చీరాల: మండలంలోని అన్ని పంచాయతీలు, మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులలో ఆయా నాయకులు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి నేరుగా పింఛన్లను పంపిణీ చేశారు. పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఐదవ వార్డులో కౌన్సిలర్ సూరగాని లక్ష్మి ఆ వార్డులోని లబ్ధిదారులకు పెన్షన్లను అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్‌ను పెంచటంతో ఆ నగదు లబ్ధిదారులకు ఎంతో ఉపయోగపడుతుందని ఆమె అన్నారు.

అద్దంకి: అద్దంకి మండలం మణికేశ్వరంలో ఎంపీడీవో దేవసేన కుమారి మంగళవారం పింఛన్లు పంపిణీ చేశారు. పింఛన్ల పంపిణీ జరుగుతున్న తీరును సచివాలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఐటీడీపి అధ్యక్షుడు కరిముల్లా, గ్రామ టిడిపి నాయకులు మీరావలి, అశోక్, మౌలాలి, మేకల ఆదినారాయణ, అబ్బుల్లా, శివ, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

యద్దనపూడి: మండలంలోని అన్ని గ్రామాలలో మంగళవారం యన్.టి.ఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. పంపిణీ మొత్తం 96 శాతం పూర్తి అయినట్లు యద్దనపూడి ఎంపీడీవో మహ్మద్ అకీబ్ జావీద్ తెలిపారు. పంపిణీ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలంలో మంగళవారం సుమారు 97.10 శాతం పింఛన్లు పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖర్ తెలిపారు. మండల వ్యాప్తంగా 8,549 మంది పెన్షన్‌దారులు ఉండగా వీరిలో 8,301 మందికి తొలిరోజే అందజేయడం జరిగిందన్నారు.

సంతమాగులూరు: మండలంలోని అన్ని గ్రామాలలో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ 96.67 శాతం పూర్తయినట్లు ఎంపీడీవో కిరణ్మయి తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు, వీఆర్వోలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు

ప్రజాశక్తి-పంగులూరు

జిల్లా స్థాయిలో "సేవ్ ద గర్ల్ చైల్డ్" అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో పంగులూరు మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు బహుమతులు సాధించారు. మంగళవారం బాపట్లలో డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో జరిగిన పోటీలో చందలూరు ఉన్నత పాఠశాలకు చెందిన చల్లా గాయత్రి డిబేట్ పోటీలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించి రూ.5 వేల బహుమతిని గెలుచుకుంది. బూదవాడ ఉన్నత పాఠశాల విద్యార్థి జి.వెంకట పావని సాయి ఎస్సే రైటింగ్ పోటీలో జిల్లా స్థాయిలోద్వితీయ ద్వితీయ బహుమతి సాధించి రూ.3 వేల బహుమతిని గెలుచుకుంది. వీరు ఈ నెల 11వ తేదీన అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు తీసుకోనున్నట్లు ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయులతో పాటు, ఉపాధ్యాయులు అభినందించారు.

చల్లా గాయత్రి

పావని సాయి

మంత్రి గొట్టిపాటి పరామర్శ

ప్రజాశక్తి - పంగులూరు

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పంగులూరు మండల పర్యటన సందర్భంగా పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పంగులూరులో ఇటీవల గుండె శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న రాయిని రామకృష్ణను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం చందలూరు గ్రామానికి చెందిన పల్లపోతు శ్యాంసుందర్ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.10 వేల చెక్కును మంత్రి రవికుమార్‌కు అందజేశారు. సంతమాగులూరు మండలం కొప్పరం గ్రామానికి చెందిన వికలాంగుడు షేక్ రసూల్‌కు మూడు చక్రాల స్కూటర్‌ను మంత్రి రవికుమార్ అందజేశారు. మండలంలోని ముప్పవరం గ్రామానికి చెందిన నందిపాటి చంద్రగౌడ్ మృతిచెందగా ఆయన మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముప్పవరం గ్రామంలోని కుక్కపల్లి ఆదినారాయణ అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయనను మంత్రి పరామర్శించారు.

పంగులూరులో రామకృష్ణని పరామర్శిస్తున్న మంత్రి గొట్టిపాటి

యాజమాన్య పద్ధతులతో నాణ్యమైన దిగుబడులు

'పొలం పిలుస్తోంది'లో శాస్త్రవేత్త రాధాకృష్ణ

ప్రజాశక్తి-అద్దంకి

సమతుల ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించి నాణ్యమైన దిగుబడులు సాధించాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త జె.రాధాకృష్ణ సూచించారు. చిన కొత్తపల్లి గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో శాస్త్రవేత్త రాధాకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా అధికంగా వాడటం వలన చీడ పీడలు ఎక్కువగా వస్తాయని, యూరియాతో పాటు పొటాష్ ఎకరాకు 20 కేజీలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు కె.ధనరాజ్ మాట్లాడుతూ ఎరువులు అన్నీ రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

సంతమాగులూరు: ప్రకృతి వ్యవసాయంతో రైతులు అధిక దిగుబడులు సాధించ వచ్చని ఇంచార్జి మండల వ్యవసాయాధికారి బి.అంజిరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని సజ్జాపురం, కొప్పరం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, రైతులు, పశు వైద్య సిబ్బంది, ఏఈఓ మాధురి, విఏఏలు నాగవర్ధన్, నాగయ్య పాల్గొన్నారు.

ఇంకొల్లు: మండలంలోని పూసపాడు, దుద్దుకూరు గ్రామాలలో మంగళవారం ఏవో వేణుగోపాల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ దుక్కులో మిరప నారు నాటే ముందు వేప పిండితో కలియ దున్నుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సహాయకులు అనిల్, భరత్, కిరణ్ పాల్గొన్నారు.

పర్చూరు: పర్చూరు గ్రామంలోని మార్కెట్ యార్డ్ ఆవరణలో, ఉప్పుటూరు గ్రామంలో ఈ రోజు పొలం పిలుస్తోంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి మేరమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ మోహన రావు మాట్లాడుతూ రైతులు తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించేలా కృషి చేయడమే పొలం పిలుస్తోంది ముఖ్య ఉద్దేశ్యం అని తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి మేరమ్మ, సూపర్‌వైజర్ సరిత పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శాస్త్రవేత్త రాధాకృష్ణ

రేపల్లె: రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందించి అధిక దిగుబడులు సాధించే లక్ష్యంతో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సహాయ వ్యవసాయ సంచాలకులు ఆర్.విజయబాబు స్పష్టం చేశారు. రేపల్లె బేతపూడి-1, బేతపూడి-2 గ్రామంలోని సచివాలయ పరిధిలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బాపట్ల వరి పరిశోధన కేంద్రం నుంచి డాక్టర్ టి.హరిత పాల్గొన్నారు. ఏడిఏ ఆర్.విజయ్ బాబు మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధశాఖలు, పథకాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పరుచూరి రాఘవ, వీఆర్వో ఎ.వెంకటేశ్వర్లు, సెక్రటరీ అనూష, డిజిటల్ అసిస్టెంట్ హరిక పాల్గొన్నారు.

కారంచేడు: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు పొలం పిలుస్తుంది కార్యక్రమం ఉపయోగపడుతుందని కారంచేడు వ్యవసాయ అధికారి కె.సుధీర్ బాబు అన్నారు. మంగళవారం కారంచేడు మండలంలో ఆదిపూడి, ఎర్రంవారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సుధీర్ బాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, శాంతి, రెండు గ్రామాల్లోని రైతులు పాల్గొన్నారు.

వేటపాలెం: మండలంలోని చల్లారెడ్డిపాలెం-1, కొత్తపేట-3 రైతు సేవా కేంద్రాల పరిధిలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వేమూరు: మండలంలోని చదలవాడ, కాకర్లమూడిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ అధికారులు సిహెచ్ సునీత రైతులకు వరి పంటలో సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చదలవాడ గ్రామ సర్పంచ్ దాసరి రమేష్, కాకర్లమూడి గ్రామ జిల్లా రైతు సంఘం నాయకులు అమ్మిశెట్టి కిషోర్ కుమార్, వివిఏ విజయ్, రైతులు పాల్గొన్నారు.

మేదరమెట్ల: మండలంలోని ఎర్రబాలెం, తిమ్మన పాలెం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సహాయ వ్యవసాయ సంచాలకులు కె.ధనరాజ్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాట్ శాస్త్రవేత్తలు రాధాకృష్ణమూర్తి, ఎంఏఓ పి.శ్రీనివాసరావు, విఏఏ షరీఫ్, ఏహెచ్ఏ సాహితి, రైతులు పాల్గొన్నారు.

శాస్త్రీయ అవగాహనతోనే భవిత

జెవివి బాపట్ల జిల్లా అధ్యక్షుడు భాస్కరరావు

విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్టు

ప్రజాశక్తి-బాపట్ల

విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన ద్వారానే వారి భవిత ప్రకాశవంతమవుతుందని జన విజ్ఞాన వేదిక బాపట్ల జిల్లా అధ్యక్షులు వై.భాస్కర రావు అన్నారు. మంగళవారం పట్టణంలో సరస్వతి మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాలలో బాపట్ల మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహణకు సంబంధించిన ప్రశ్న పత్రాలను మండల స్థాయిలో వివిధ ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో కలిసి భాస్కరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్ట్ జిల్లాస్థాయికి అర్హత సాధించిన నర్సాయపాలెం సాంఘిక సంక్షేమ పాఠశాల, బాపట్ల లిటిల్ ఏంజిల్స్ హై స్కూల్ విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు, బహుమతులు అందజేశారు.

చెరుకుపల్లి: చెకుముకి సంబరాల్లో భాగంగా మండల స్థాయి పోటీల్లో గుల్లపల్లి, రాజోలు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో గుల్లపల్లి ఉన్నత పాఠశాల ప్రథమ స్థానంలో, రాజోలు ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. ప్రైవేటు పాఠశాలల విభాగంలో గూడవల్లి వనజా చంద్ర పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో, పోలియో

ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మాట్లాడుతున్న జెవివి జిల్లా అధ్యక్షుడు భాస్కరరావు

వరల్డ్ స్కూల్ పొన్నపల్లి విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఎన్ఆర్ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు.

మెదరమెట్ల: మెదరమెట్లలో నిర్వహించిన చెకుముకి సైన్స్ పోటీలలో రాదాస్ గీతం విద్యార్థులు ప్రథమ స్థానాన్ని పొం దారు. మంగళవారం మేదరమెట్ల ఉన్నత పాఠశాలలో జెవివి ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ పోటీలను నిర్వహించారు. పాఠశాలకు చెందిన సింధుప్రియ, మనో ప్రసన్న, దీదీప్య అంజలి ప్రథమస్థానం సాధించారు. ద్వితీయ స్థానంలో సైదా బాబు, శివరాం, ధన స్త్రీలు ఉన్నారు. విద్యార్థులను ప్రధానో పాధ్యాయురాలు రాధాకృష్ణకుమారి అభినందించారు. వీరు జిల్లా స్థాయిలలో పాల్గొంటారని తెలిపారు.

పంగులూరు: మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో బూదవాడ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. మంగళవారం పంగులూరులోని ఉన్నత పాఠశాలలో 2024 చెకుముకి సైన్స్ సంబరాలులో భాగంగా జరిగిన టాలెంట్ టెస్ట్‌లో పదో తరగతి విద్యార్థి భవనం దివ్య, 9వ తరగతి విద్యార్థి అలవాల పూజిత, నందవరపు యాస్మిన్ టీం ప్రథమ స్థానంలో నిలిచింది.

అద్దంకి: మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో అర్బన్ కేటగిరిలో తిమ్మాయపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం నిలిచారు. వీరు జిల్లా లెవెల్ టెస్ట్‌కు ఎన్నికైనందుకు ప్రధానోపాధ్యాయులు పి.గంగాధం ర్రావు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు.

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్టు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవా రం నిర్వహించారు. ఈ టెస్ట్‌లో సెయింట్ జోసెఫ్ స్కూల్ విద్యార్థులు ప్రథమస్థానం, తిమ్మాయపాలెం హైస్కూల్ విద్యార్థులు ద్వితీయస్థానం, శంకవరపాడు హైస్కూల్ విద్యార్థులు తృతీయ స్థానం సాధించారు.

వేటపాలెం: దేశాయిపేటలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వేటపాలెం మండల స్థాయిలో "చెకుముకి" టాలెంట్ టెస్ట్ మంగళవారం జరిగింది. ముందుగా దేశాయిపేట హైస్కూలు ప్రధానోపాధ్యాయులు పరీక్షా పత్రాన్ని ఆవిష్కరించారు.

కొత్తపేటలోని బి.ఆర్.కె. హైస్కూలు విద్యార్థులు ప్రథమ స్థానాన్ని పొందగా, పందిళ్లపల్లి హైస్కూలు విద్యార్థులు ద్వితీయ స్థానం, వేటపాలెంలోని బి.బి.హెచ్.విద్యార్థులు తృతీయ స్థానాన్ని పొందారు.

చీరాల: జనవిజ్ఞానవేదిక మండల స్థాయి చెకుముకి ప్రతిభా పరీక్ష స్థానిక కె.జి.యం. గర్ల్స్ హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ పరీక్షలో ప్రభుత్వ పాఠశాలల పరిధిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు), ఈపురుపాలెం, ప్రైవేట్ పాఠశాలల పరిధిలో ఎకె అండ్ కె ఉన్నత పాఠశాల, గాంధీనగర్ మరియు పట్టణ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల పరిధిలో ఎఆర్‌యం ఉన్నత పాఠశాల, పేరాల, ప్రైవేట్ పాఠశాలల పరిధిలో విజ్ఞానభారతి ఉన్నత పాఠశాల, చీరాల ప్రథమ స్థానాలను కైవసం చేసుకున్నాయి.

నిజాంపట్నం: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం నిజాంపట్నం ఉన్నత పాఠశాలలో టాలెంటు టెస్టు నిర్వహించారు. ఈ సందర్భంగా జెవివి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.హరిబాబు, ప్రసాద్ మాట్లాడుతూ ఈ పరీక్షలో మండలంలోని ఏడు ప్రభుత్వ, మూడు ప్రైవేటు పాఠశాలలు పోటీ పడగా ప్రభుత్వ విభాగం నుండి నిజాంపట్నం జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రథమ, అడవులదీవి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ద్వితీయ స్థానాలు సాధించారని అలాగే ప్రైవేట్ విభాగం నుండి నిజాంపట్నం ఆల్ కమర్ క్రియేటివ్ అకాడమీ స్కూల్ విద్యార్థులు ప్రథమ, నిజాంపట్నం ఆక్స్ఫర్డ్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానాలు సాధించారని తెలిపారు.

తీవ్ర గాయాలైనా..

ఆగని ఫించన్ పంపిణీ

పంపిణీ అనంతరం ఆపరేషన్ చేయించుకున్న పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాసిం

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

చికిత్స పొందుతున్న కార్యదర్శి ఖాసిం

మండలం నాయుడుపల్లిలో పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న షేక్ ఖాసీంకు సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పక్కటెముకలు, కుడి భుజం వద్ద ఎముక విరిగి తీవ్ర గాయాలపాలయ్యాడు. అయినా మంగళవారం ఫిం చన్ పంపిణీలో ఎటువంటి అంతరాయం ఏర్పడకూడదని ఫించన్ పంపిణీ చేసి మార్కాపురం పట్టణములోని సిమ్స్ వైద్యశాలలో మంగళవారం సాయంత్రం ఆపరేషన్ చేయించుకున్నారు. తీవ్ర గాయాలైనా కానీ విధినిర్వహణలో ఏ మాత్రం నిర్లక్ష్యం చూపకుండా పెన్షన్ పంపిణీ చేసిన ఖాసీంను పలువురు ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ప్రశంసించారు.

గాంధీ జయంతి రోజున

మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-బాపట్ల

గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న బుధవారం బాపట్ల పట్టణంలో మాంసం, మంసాహారం విక్రయాలను నిషేధించడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్ మంగళవారం విలేకరులకు తెలిపారు. పట్టణంలో జంతు వధశాలను మూసేయాలన్నారు. వేట మాంసం, చికెన్, చేపలు విక్రయించరాదన్నారు. హోటళ్లు, రెస్టారెంట్ల యజమానులు నిబంధనలు అతిక్రమించి మాంసాహారం విక్రయిస్తే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని నిర్మల్ కుమార్ హెచ్చరించారు.

పుస్తకాలు అందజేత

భట్టిప్రోలు: మండలంలోని ఓలేరు పల్లెపాలెం గ్రామంలో వరద బాధితులైన విద్యార్థులకు గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, న్యాయమూర్తి వైవిఎస్‌డిజి పార్థసారథి, న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధి టి.లీలావతి ఆదేశాల మేరకు మంగళవారం రేపల్లె సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు పుస్తకాలు, ఇతర సామాగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి నీలం దేవరాజ్, గ్రామ సర్పంచి మేరుగ రంగారావు, పాఠశాల హెచ్ఎం నరసింహారావు తదితరులున్నారు.

ఎక్సైజ్ సిఐగా శ్రీరామ్ ప్రసాద్

శ్రీరాం ప్రసాద్

నగరం: నగరం నూతన ఎక్సైజ్ సిఐ గా శ్రీరామ్ ప్రసాద్ మంగళవారం బాధ్య తలు స్వీకరించారు. గతంలో నరసరావు పేటలో విధులు నిర్వహించిన ఈయన జనరల్ బదిలీలలో భాగంగా నగరం వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు పరుస్తున్న నూతన మద్యం పాలసీ విధానాన్ని అమలు చేయడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

వక్తృత్వ పోటీల్లో విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-భట్టిప్రోలు

సెనగపల్లి నవ్య

బాపట్ల మునిసిపల్ పాఠశాలలో జిల్లా స్థాయిలో మంగళవారం 'చిన్నారులను బాలికలను రక్షిద్దాం' అనే అంశం పై జరిగిన వక్తృత్వ పోటీలో సూరేపల్లి విద్యార్థిని సెనగపల్లి నవ్య ద్వితీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం కూచిభొట్ల శ్రీనివాస శర్మ మాట్లాడుతూ జిల్లాస్థాయిలో జరిగిన ఈ పోటీలలో తమ పాఠశాల విద్యార్థిని ద్వితీయ స్థానాన్ని సాధించడం గర్వకారణంగా ఉందన్నారు.

హక్కుల పట్ల అవగాహన అవసరం

ప్రజాశక్తి-బాపట్ల

బాలికల హక్కుల సాధనకు విద్యార్థి దశనుండే విద్యార్థినిలు పూర్తిస్థాయి అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాదిక్ అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల 6 నుండి 10వ తరగతి విద్యార్థులకు మంగళవారం బాపట్ల పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో సేవ్ ద గర్ల్ చైల్డ్, బాలికల పటిష్టతతోనే ప్రపంచ మనుగడ అనే అంశంపై జిల్లా స్థాయిలో వ్యాసరచన డిబేట్ చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

ప్రజాశక్తి - చీరాల

పంచాయతీ అభివృద్ధిలో పారిశుధ్య కార్మికుల సేవలు ప్రశంసనీయమని కొత్తపేట పంచాయతీ కార్యదర్శి రమేష్ బాబు అన్నారు. మంగళవారం కొత్తపేట పంచాయితీ కార్యాలయంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా పలు పారిశుధ్య పనులు చేపట్టారు. ఇందులో భాగంగా ఉత్తమ పంచాయతీ కార్మికులకు సన్మానించారు. 30 మంది కార్మికులకు వారి సేవలను గుర్తించి శాలువాతో సత్కరించారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి - రేపల్లె

మద్యం దుకాణాలకు నేటి నుండి ఈ నెల 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని రేపల్లె ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సిఐ ఆర్.దివాకర్ తెలిపారు. ఈనెల తొమ్మిదో తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. ఈనెల 11వ తేదీన కలెక్టర్ సమక్షంలో లాటరీ ద్వారా షాపులు నిర్ణయిస్తామన్నారు. రేపల్లె మున్సిపాలిటీలో 3 షాపులు, చెరుకుపల్లి మండలంలో 5 షాపులు, నగరం మండలంలో 3 షాపులు, నిజాంపట్నం మండలంలో 4 షాపులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పాఠశాలకు బీరువా బహూకరణ

ప్రజాశక్తి - చీరాల

చీరాల క్షీరపురి లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు లయన్ ఐతా రవీంద్రనాథ్, ఆయన కుమారుడు శ్రీరామ కృష్ణ విద్యార్థుల అవసరార్థం రెండు స్టీలు బల్లలు, బీరువాను మంగళవారం అందజేశారు. వేటపాలెం మండలం అక్కయ్యపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయులు భవనం బద్రిరెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు నడపొద్దు

ప్రజాశక్తి-సంతమాగులూరు

మండలంలో వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నందున దమ్ము చక్రాల ట్రాక్టర్ల యజమానులు తమ ట్రాక్టర్లకు ఇరుసులు బిగించుకుని రోడ్లపై తిరగాలని ఎస్ఐ పట్టాభి రామయ్య ట్రాక్టర్ యజమానులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని కామేపల్లిలో దమ్ము చక్రాలతో రోడ్లపై నడుస్తున్న ట్రాక్టర్లను అడ్డుకున్నారు. దమ్ము చక్రాలతో రోడ్లపై తిరగడం వల్ల రోడ్లు డ్యామేజీ అవుతున్నాయన్నారు. ఇరుసులు బిగించకుండా రోడ్లపై తిరిగే ట్రాక్టర్ యజమానులకు జరిమానా విధించడం జరుగుతుందని ఎస్ఐ ట్రాక్టర్ యజమానులను హెచ్చరించారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ప్రజాశక్తి - పర్చూరు

పౌష్టికాహారంతో ఆరోగ్యంగా ఉండవచ్చని సిడిపిఒ జి.సుభద్ర అన్నారు. ఐసిడిఎస్ పర్చూరు ప్రాజెక్ట్ కార్యాలయంలో పౌష్టికాహార మాసోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సిడిపిఒ జి.సుభద్ర, తహశీల్దార్ పి.బ్రహ్మయ్య, ఎపీడీవో ప్రద్యుమ్న కుమార్, పీహెచ్సీ డాక్టర్ ఏకాంబరం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మూడు మండలాలకు సంబంధించిన సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం అందజేత

ప్రజాశక్తి-అద్దంకి

చెక్కు అందజేస్తున్న దాతలు

సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవస్థానం రాతి ముఖ మండపం నిర్మాణానికి మోదడుగు వెంకటేశ్వరరావు, సునీత దంపతులు రూ.1,00,116 విరాళం అందజేశారు. మంగళవారం దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి ఎం.తిమ్మనాయుడుకు ఈ మేరకు చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు కిషోర్ బాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టాక్సీ యూనియన్ అధ్యక్షుడిగా సురేష్

ప్రజాశక్తి - చీరాల

శ్రీ పొట్టి శ్రీరాములు టాక్సీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులుగా మానుకోట సురేష్ బాబును యూనియన్ సభ్యులు ఎన్నుకున్నట్లు సిఐటియు చీరాల పట్టణ కార్యదర్శి ఎం.వసంతరావు తెలిపారు. మంగళవారం స్థానిక కారు స్టాండ్ వద్ద ఆఫీసు బేరర్స్ ఎన్నిక జరిగింది. ప్రెసిడెంట్‌గా మానుకోట సురేష్ బాబు, సెక్రటరీగా జి.సురేష్, జయకుమార్, జాయింట్ సెక్రటరీగా తాళ్లూరు చంద్రశేఖర్, ట్రెజరర్‌గా సిరిపురం వెంకటేశ్వర్లును ఎన్నుకున్నట్లు తెలిపారు.

108లో మహిళ ప్రసవం

ప్రజాశక్తి-చిన్నగంజాం

చిన్నగంజాం మండలంలోని కోడురివారి పాలెం గ్రామానికి చెందిన గర్భిణీ ఈశ్వరమ్మకి పురిటి నొప్పులు రావడంతో 108కి సమాచారం అందించారు. 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ఆమెకు పురిటి నొప్పులు తీవ్రం కావడంతో 108 టెక్నీషియన్ ఇఎమ్‌టి నాగలక్ష్మి సమయస్ఫూర్తితో వ్యవహరించి పైలట్ భాగ్యరావు మరియు కుటుంబ సభ్యులను సమన్వయం చేసుకుంటూ వాహనంలోనే సుఖ ప్రసవం చేసి తల్లీబిడ్డల్ని రక్షించారు.

అత్యాశే సైబర్ నేరగాళ్ల ఆయుధం

- వెబ్‌సైట్ ల ద్వారా సైబర్ నేరాలకు పాల్పడుతున్న కేటుగాళ్లు
- ఎస్పీ తుషార్ డూడి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

డబ్బులు ఎవ్వరికీ ఊరికేరావు అన్న విషయాన్ని గుర్తించి మీ కష్టార్జితం సైబర్ నేరస్తుల పాలు చేసుకోవద్దని, అపరిచిత వెబ్ సైట్స్,ఎపికె ఫైల్స్ క్లిక్ చెయ్యవద్దని జిల్లా ఎస్పీ తుషార్ డూడి జిల్లా ప్రజలకు సూచించారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న సైబర్ మోసాల గురించి ఎస్పీ మంగళవారం ప్రజలకు వివరించారు. జిల్లా ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలు గురించి అవగాహన కలిగి ఉంటే చాలా వరకు నేరాలను తగ్గించవచ్చునన్నారు. ఏదైనా సైబర్ నేరం జరిగిన వెంటనే 1930 నెంబర్ కు కాల్ చేయడం ద్వారా లేదా సైబర్‌క్రైమ్ వెబ్ సైట్స్ ద్వారా పిర్యాదు చేస్తే పోగొట్టుకున్న సొమ్ము చాలా వరకు తిరిగి పొందే అవకాశం ఉంటుందన్నారు. ఇటీవల ఐఎఎస్ ఇండియా అనే వెబ్ సైట్స్ లో చాలా మంది డబ్బులు పెట్టి మోసపోయినట్లు సైబర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదులు వచ్చాయన్నారు. వీరు మొదట ఉచితంగా చిన్నచిన్న టాస్క్ లు నిర్వహించి గెలిచిన సొమ్ము ఖాతాలలో జమ చేస్తారని, ఆ తరువాత తక్కువ మొత్తంలో డబ్బులు పెట్టుబడి పెట్టించి రెండింతలు, మూడింతలు అధిక ఆదాయం ఇచ్చి ఆశ చూపుతారన్నారు. సైబర్ నేరగాళ్ల మాయలో పడి ఎక్కువ మొత్తంలో డబ్బులు పెట్టినప్పుడు వాటిని ఇవ్వకుండా మోసం చేస్తారని పేర్కొన్నారు. ప్రతి వారంలో ఒకరోజు లేదా గురువారం నాడు మాత్రమే అకౌంట్‌లోకి డబ్బులు ట్రాన్స్ఫర్ చేసుకోవాలని నిబంధన విధిస్తారన్నారు. అప్పటి వరకు వివిధ కారణాలు చెబుతూ అధిక మొత్తంలో డబ్బులు పెట్టుబడిగా పెట్టించి సైబర్ నేరగాళ్ల వెబ్సైట్ లో వున్న అకౌంట్ లో ఆ డబ్బులు అధికం అవుతున్నట్లు చూపుతారన్నారు. తీరా డబ్బులు ట్రాన్స్ఫర్ చేసుకొనే రోజు వచ్చేసరికి మీ బ్యాంకు అకౌంట్‌కు ట్రాన్స్ఫర్ అవ్వవని, అవి కేవలం వారి సైట్‌లో కనిపించే డబ్బులు మాత్రమేనని తెలిపారు. మోసపోయామని గ్రహించే లోపు జరగాల్సిన నష్టం జరిగిపోతుందన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు.

ఓటర్ల జాబితా తయారీ పక్కాగా ఉండాలి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా తయారీకి అభ్యంతరాల స్వీకరణ, పరిశీలన పక్కాగా ఉండాలని ఏపీ రాష్ట్ర ఎన్నికల కమిషన్ సీఈఓ వివేక్ యాదవ్ తెలిపారు. రాష్ట్ర రాజధాని నుంచి మంగళవారం ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో వీక్షణ సమావేశం నిర్వహించారు. కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి నిర్దేశించిన గడువులోగా కార్యక్రమాలన్నిటిని పూర్తి చేయాలని వివరించారు. ఇంటింటా ఓటర్ల సర్వే ప్రక్రియ బాపట్ల జిల్లాలో 99.09 శాతం పూర్తయిందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు తెలిపారు. వీక్షణ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, బాపట్ల ఆర్డిఓ పి.గ్లోరియా ఉన్నారు.

మంత్రి గొట్టిపాటిని కలిసిన ఎస్ఈలు..

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మంత్రిని కలిసిన ఎస్ఈలు

రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ శాఖలో జరిగిన బదిలీల్లో భాగంగా ప్రకాశం, బాపట్ల జిల్లాల విద్యుత్ శాఖకు నూతన ఎస్ఈల నియామకాలు జరిగాయి. బాపట్ల జిల్లా ఇన్‌ఛార్జీ ఎస్ఈగా జి.ఆంజనేయులు, ప్రకాశం జిల్లా ఇన్‌ఛార్జి ఎస్ఈగా కట్టా వెంకటేశ్వర్లు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఘనంగా స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రక్తదాతలను సత్కరిస్తున్న దృశ్యం

జాతీయ స్వచ్ఛంద రక్త దాతల దినోత్సవం సందర్భంగా ఒంగోలు కొత్త కూరగాయల మార్కెట్ ఎదురుగా ఉన్న రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో మంగళవారం శ్రీ హర్షిణి విద్యార్థులతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అనేక సార్లు రక్త దానం చేయడమే రక్త దాన శిబిరాలు ఏర్పాటు చేసిన శ్రీ హర్షిణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డి.ఆంజనేయులు, 18 ఏట నుండి ప్రతి మూడు నెలలకు ఒకసారి చొప్పున ఐదు సార్లు రక్తదానం చేసిన విద్యార్థి బి.మహేశ్వరరెడ్డి, ఆపద సమయంలో స్వచ్ఛందంగా ముందుకొచ్చి అనేకసార్లు రక్తదానం చేసిన ఆర్ఎస్ ఫ్యాషన్ శ్రీనివాసరావులను రెడ్ క్రాస్ చైర్మన్ ప్రకాష్ బాబు, బ్లడ్ బ్యాంక్ కన్వీనర్ మంగళగిరి నరసింహారావు, కోఆర్డినేటర్ నయనాల రామకష్ణ సత్కరించారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్ డా కష్ణ, వైస్ చైర్మన్ డాక్టర్ సిహెచ్ వెంకటేశ్వరరెడ్డి, బ్లడ్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన మాగుంట

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

లోకేష్‌తో ఎంపీ మాగుంట, రాఘవరెడ్డి

రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌ను ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఆయన తనయుడు, యువ నాయకులు మాగుంట రాఘవరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ఉండవల్లి లోని ముఖ్యమంత్రి నివాసంలో మంత్రి లోకేష్‌ను కలిసిన వీరు గృహ, పట్టణ వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా నియమించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

వృద్ధులు అనుభవాల గనులు

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డిబివి స్వామి
- ఘనంగా అంతర్జాతీయ వృయోవృద్ధుల దినోత్సవం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సీనియర్ సిటిజన్స్‌ను సత్కరిస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా

వృద్ధులు మనకు భారం కాదని, వారు అనుభవాల గనులని రాష్ట్ర సాంఘిక సంక్షేమం, వికలాంగులు వయోవృద్ధుల సంక్షేమం, సచివాలయాలు, వాలంటరీల శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. సమాజ అభివద్ధిలో వారి అనుభవాలను రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకుంటుందన్నారు. 34వ అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ప్రకాశం భవనంలో నిర్వహించిన వేడుకలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వికలాంగులు, హిజ్రాలు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్ విజయ్ కుమార్, ఎఎస్‌పి కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి డిబివి స్వామి మాట్లాడుతూ వద్ధులకు సంక్షేమంతో పాటు సమాజాభివద్ధిలో వారి సూచనలు తీసుకోవడానికి గ్రామస్థాయిలో సీనియర్ సిటిజన్స్ క్లబ్స్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోందన్నారు. ఇప్పటికే దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలోనే వద్ధులకు ప్రతినెలా 4 వేల రూపాయల సామాజిక పెన్షన్ ఇస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఓపి నమోదు సమయంలో వద్ధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లతో పాటు వార్డులను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. తమ సంరక్షణ విషయంలో ఎదురయ్యే ఇబ్బందుల గురించి వద్ధులు ఫిర్యాదు చేయటానికి టోల్ ఫ్రీ నెంబర్ 14567 పునరుద్ధరిస్తామని మంత్రి ప్రకటించారు. వృద్ధులకు అవసరమైన వినికిడి పరికరాలు, వీల్ చైర్లు, చేతి కర్రలు, కళ్లద్దాలను ప్రభుత్వం తరపున అందిస్తామన్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ వద్ధుల అనుభవాన్ని, వారి ఆలోచన పరిపక్వతను తగిన రీతిలో యువతలోని శక్తి, ఉత్సాహంతో మిళితం చేయడం ద్వారా సమాజం సర్వతోముఖాభివద్ధి చెందేలా చూస్తామన్నారు. 'బంగారు బాల్యం' తరహాలోనే వద్ధుల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే విజయ్ కుమార్ మాట్లాడుతూ వద్ధులకు అవసరమైన ఆర్థిక సుస్థిరత, ఆరోగ్య భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఎఎస్‌పి కె.నాగేశ్వరరావు మాట్లాడుతూ అభివద్ధికి పునాదులు మన పెద్దలేనని, వారిని గౌరవించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మానవ సంబంధాల విలువపై బిడ్డలకు కూడా ప్రతి ఒక్కరూ తెలియజేయాలన్నారు. వికలాంగులు, హిజ్రాలు, వయోవద్ధుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.రవి ప్రకాష్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ ఎంఎ కుమార్ రాజా, ఏపీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వెంసరాల నారాయణమూర్తి, ఎల్డర్స్ క్లబ్ అధ్యక్షులు మాగులూరి నాగేశ్వరరావు, డాక్టర్ సిహెచ్ చలమయ్య, సీనియర్ సిటిజన్స్ నేపల్లి నాగేశ్వరరావు, జె.వెంకటేశ్వర్లు, పరమేశ్వర్ రెడ్డి, దామచర్ల సక్కుబాయి డిగ్రీ కళాశాల తెలుగు లెక్చరర్ యామిని వద్ధుల సంరక్షణ ఆవశ్యకత, వారి సమస్యల పరిష్కారానికి తీసుకోవలసిన చర్యలపై మాట్లాడారు. వివిధ రంగాలలో విశేష సేవలు అందించిన సీనియర్ సిటిజన్స్ ను ఈ సందర్భంగా సన్మానించారు. పెన్షన్లు పొందుతున్న వద్ధులకు ఈ కార్యక్రమంలో వాటిని మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. అర్హులైన వద్ధులకు వినికిడి పరికరాలను కూడా పంపిణీ చేశారు. సమాజాభివద్ధిలో వద్ధుల పాత్ర, వయోవృద్ధులు- యువత మధ్య బంధం అనే అంశాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలను ప్రదానం చేశారు. కార్యక్రమ ప్రారంభంలో చిన్నారులు చేసిన నత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వికలాంగులు, వయోవృద్ధులు, హిజ్రాల సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచాలకులు జి.అర్చన, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి లక్ష్మా నాయక్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, మున్సిపల్ కమిషనర్ కె వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నెలాఖరులోపు వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

భూముల ఫ్రీ హోల్డింగ్ వెరిఫికేషన్ ప్రక్రియను నెలాఖరు లోపు పూర్తి చేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ కలెక్టర్ తమీమ్ అన్సారియా వివరించారు. మంగళవారం సాయంత్రం రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్, సిసిఎల్ఎ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్‌పి సిసోడియా తో కలసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి భూముల ఫ్రీ హోల్డింగ్ వెరిఫికేషన్ ప్రక్రియ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే ఆర్జీల పరిష్కారం వంటి అంశాలపై సమీక్షించి తగు సూచనలు ఆదేశాలు జారిచేశారు. ఒంగోలు కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ, జిల్లాలో జరుగుతున్న భూముల ఫ్రీ హోల్డింగ్ వెరిఫికేషన్ ప్రక్రియను నెలాఖరు నాటికి పూర్తి చేస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సంయుక్త కలెక్టర్ గోపాల క్రిష్ణ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డిఐజి పుష్పలత పాల్గొన్నారు.

తల్లీబిడ్డ సంరక్షణలో కెఎంసి కీలకపాత్ర

- పైలెట్ ప్రాజెక్ట్‌గా కనిగిరి సిహెచ్‌సి
- శిక్షణా తరగతులలో కలెక్టర్ వెల్లడి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

తల్లీ, బిడ్డ సంరక్షణలో ఎన్ఎంసియు, కెఎంసి(కంగారూ మదర్ కేర్) యూనిట్ కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. ఇందు కోసం కనిగిరి కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సిహెచ్‌సి)ను పైలట్ ప్రాజెక్టు గా తీసుకున్నామని, రాష్ట్రానికి ఓ మోడల్ గా నిలుస్తుందని ఆమె పేర్కొన్నారు. ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మంగళవారం ఎన్ఎంసియు, కెఎంసి సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంచి సౌకర్యాలతో కూడిన వైద్యం తల్లీ బిడ్డకు అందించాలన్న లక్ష్యంతో కనిగిరి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. వసతులతో పాటు మంచి నైపుణ్యం, నిబద్ధత కలిగిన సిబ్బందితో మాత్రమే లక్ష్యం సాధ్యమవుతుందన్నారు. కెఎంసి విధానాన్ని ఈ సందర్భంగా కలెక్టర్ వివరించారు. తన బిడ్డకు ఎలాంటి ఇబ్బందీ కలగకుండా సహజ సిద్ధమైన పౌచ్ (సంచి)లో దాచి ప్రాణాలు కాపాడే జీవి కంగారూ అని, ఇదే విధానాన్ని అమలు చేయడం ద్వారా నెలలు నిండకుండా పుట్టిన శిశువులకు, బరువు తక్కువగా పుట్టిన శిశువులకు ఎలాంటి ప్రాణాపాయం కలగకుండా చూడాలన్న ఆలోచనతోనే 'కంగారు' మోడల్ ను అమలు చేస్తున్నారన్నారు.. అప్పటివరకు కడుపులో ఉండి ఈ లోకంలోకి వచ్చిన బిడ్డకు, తల్లికి పరస్పరం సంబంధం ఉండేలాగా చేస్తారన్నారు. బిడ్డను తన ఛాతీపై సాధ్యమైనంత ఎక్కువ సమయం పడుకోపెట్టుకోవడం ద్వారా వెచ్చదనాన్ని, ప్రేమను తల్లి పంచడం, సరైన విధానంలో పాలు పట్టడం, పోషణ, శుభ్రత వంటి అంశాలపై అవగాహన కల్పించడమే ఈ విధానం లక్ష్యమన్నారు. ప్రసవ సమయంలో తల్లిలో వచ్చే హార్మోన్ల మార్పులను తిరిగి యథాస్థితికి తీసుకు రావడంపైనా వైద్యులు దష్టి పెడతారన్నారు. రిసోర్స్ పర్సన్స్ నర్సింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. శిక్షణ జరుగుతున్న తీరును కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. కార్యక్రమంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాదేవి, ఇన్‌ఛార్జి డిసిహెచ్ఎస్ శేషుకుమార్, చిన్న పిల్లల వైద్య విభాగాధిపతి డాక్టర్ ఎలిజిబెత్, ఎంసిహెచ్ చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ సతీష్ పాల్గొన్నారు.